## విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9666033186
9866092624




# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 251 | volume: 1, Issue:251 | శుక్రవారం 10 ఏప్రిల్ 2026 పేజీలు : 8 వెల : 3.00

PUBLISHED: KARIMNAGAR , HYDERABAD
CMD&EDITOR:BHUPATHI SANTHOSH


## బంగాల్‌లో నందిగ్రామ్ ఫలితం మళ్లీ పునరావృతం అవుతుంది



**పశ్చిమ మేధినీపూర్:** పశ్చిమ బెంగాల్‌లో రాబోయే ఎన్నికల్లో నందిగ్రామ్ ఫలితం మళ్లీ పునరావృతమవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భవానీపూర్‌లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ మేధినీపూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడిన మోదీ, 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతా బెనర్జీపై బీజేపీ నేత సువేందు అధికారి సాధించిన విజయాన్ని ప్రస్తావించారు. ఈసారి కూడా ప్రజలు అదే విధంగా తీర్పు ఇవ్వబోతున్నారని చెప్పారు. బంగాల్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే కీలక ఎన్నికలని ఆయన పేర్కొన్నారు. బంగాల్ వైభవాన్ని పునరుద్ధరించడానికి ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. టీఎంసీ ప్రభుత్వంపై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో తీసుకెళ్లకుండా వెనక్కి లాగుతోందని ఆరోపించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లేకపోవడం, ఉన్న అవకాశాలను కూడా చొరబాటుదారులకు ఇస్తున్నారని మోదీ ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో అవకతవకలు జరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బీజేపీకి విజయం ఖాయమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. బంగాల్ అభివృద్ధి కోసం ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆవాస పాఠశాలల్లో లోపాలపై కలెక్టర్ ఆగ్రహం



**భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాతకొత్తగూడెంలో ఉన్న సమగ్ర శిక్ష పరిధిలోని నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఆవాస విద్యాలయం, పట్టణ బాలుర ఆవాస విద్యాలయాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ ఆకస్మికంగా తనిఖీ చేసి లోపాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల నిర్వహణలో కనిపించిన నిర్లక్ష్యంపై సంబంధిత అధికారులను ప్రశ్నిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తనిఖీల సమయంలో ఏడవ తరగతి గదిని సందర్శించిన కలెక్టర్, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, భోజనం, ఆహార నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల ఇంగ్లీష్ పఠన సామర్థ్యాన్ని పరీక్షించి వారి ప్రదర్శన పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతంలోని పాఠశాలలోనే విద్యార్థుల స్థాయి తక్కువగా ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. విద్యార్థులు సరిగా చదవలేకపోవడానికి గల కారణాలపై ప్రిన్సిపల్‌ను ప్రశ్నించిన కలెక్టర్, బోధనలో లోపాలు ఎందుకు ఉన్నాయో వివరణ కోరారు. బోధన విధానాల్లో మార్పులు చేయకపోతే విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ఉపాధ్యాయులు బాధ్యతతో బోధన నిర్వహించాలని సూచించారు. స్టోర్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ అవసరమైన సరుకులు తగినంతగా లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సరఫరా వ్యవస్థలో లోపాలు ఉన్నాయని గుర్తించి సంబంధిత అధికారులను ప్రశ్నించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కిచెన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ పరిశుభ్రత లోపంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఆరోగ్యానికి హాని కలిగించే పరిస్థితులు పునరావృతం కాకుండా వెంటనే మెరుగుదల చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్ సిబ్బంది ఎక్కువగా కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్నట్లు గమనించారు. అయినప్పటికీ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచిస్తూ, సంబంధిత ఎంఈఓకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. పాఠశాలల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## "వృక్షవేదం 2.0" పుస్తకాన్ని రాష్ట్రపతికి అందజేసిన రచయిత



**న్యూఢిల్లీ:** "వృక్ష వేదం 2.0" పుస్తకాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేసిన సందర్భంగా ప్రకృతి పరిరక్షణపై కీలక సందేశాలు వెలువడ్డాయి. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో పంచభూతాల ప్రాముఖ్యతను రాష్ట్రపతి ప్రస్తావిస్తూ, ప్రకృతి మరియు మానవ జీవితం విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. తైత్తిరీయ ఉపనిషత్‌లో పేర్కొన్న ఆకాశం, వాయు, అగ్ని, జలం, పృథ్వి అనే పంచభూతాలు జీవనానికి ఆధారం అని రాష్ట్రపతి వివరించారు. ప్రకృతిని కాపాడితే మనల్ని మనమే కాపాడుకున్నట్లేనని ఆమె అభిప్రాయపడ్డారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. "భూమి పచ్చగా ఉంటేనే జీవితం పుష్పిస్తుంది" అనే రాష్ట్రపతి వ్యాఖ్యలు గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమానికి ప్రేరణగా నిలిచాయి. గత ఎనిమిదేళ్లలో ఈ కార్యక్రమం ద్వారా 19.6 కోట్ల మొక్కలు నాటడం ఒక ప్రజా ఉద్యమంగా మారిందని పేర్కొన్నారు. ప్రకృతి సంరక్షణతో పాటు ఆధ్యాత్మికతను కలిపి సమాజంలో చైతన్యం తీసుకురావడం అవసరమని ఈ సందర్భంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పర్యావరణ బాధ్యతతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం మరింతగా గుర్తు చేసింది. రాష్ట్రపతి ప్రోత్సాహం, ఆశీర్వాదాలతో ఈ ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలనే సంకల్పాన్ని రచయిత వ్యక్తం చేశారు. ప్రకృతితో మనిషి అనుబంధాన్ని పునరుద్ధరించేందుకు ఇలాంటి ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భూమిని పచ్చగా ఉంచడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించాలనే సందేశంతో ఈ కార్యక్రమం ముగిసింది.

## ముదిగొండలో 50 పడకల ఆసుపత్రి
## నిర్మాణ పనులపై సమీక్ష

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు...
- పనుల వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు...
- వారానికొక ప్రణాళికతో నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశం...
- నాణ్యత, పురోగతిపై సమగ్ర సమీక్ష...




**ఖమ్మం:** ముదిగొండ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 50 పడకల ఆసుపత్రి భవనం పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలిస్తూ జరుగుతున్న పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్దిష్ట కాలపరిమితిలో నిర్మాణాన్ని పూర్తి చేసేలా కట్టుదిట్టమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పనుల్లో ఎలాంటి ఆలస్యం సహించబోదని హెచ్చరించారు. వారానికొకసారి ప్రణాళికలు సిద్ధం చేసి పనుల పురోగతిని సమీక్షించాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతీ దశను సమయానికి పూర్తి చేస్తూ లక్ష్యాన్ని సాధించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో సమన్వయం కీలకమని తెలిపారు. నిర్మాణ ప్రాంగణాన్ని మొత్తం సందర్శించిన భట్టి విక్రమార్క, జరుగుతున్న పనుల నాణ్యతను కూడా పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గకూడదని స్పష్టం చేశారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆసుపత్రి నిర్మాణం ఉండాలని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన తరువాత స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. పనులను వేగవంతం చేస్తూ నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులు కట్టుబడి పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.

## ప్రజలు మెచ్చేలా వైద్య సేవలు అందించండి..


- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా...
- చిగురు మామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పల్లె దవఖాన తనిఖీ...

**కరీంనగర్:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సేవలపై పేషంట్లతో మాట్లాడారు.



ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా సేవలు ఎలా ఉన్నాయి.. అని ఆరా తీశారు. అదేవిధంగా వైద్యులతోనూ మాట్లాడారు. ప్రజలు మెచ్చే విధంగా వైద్య సేవలు అందించాలని అప్పుడే వైద్యులకు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. దీంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం మరింత పెరుగుతుందన్నారు. పేషంట్లకు బాధ్యతయుతంగా వైద్య సేవలు అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ ఓపి గది ఇతర విభాగాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా పక్కనే ఉన్న పల్లె దవాఖాన ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఇక్కడ వైద్య సేవలపై అటు ప్రజలు ఇటు అధికారులతోనూ మాట్లాడారు.. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలంతా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రెండు చోట్ల మందులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ జగదీశ్వర్ తహసిల్దార్ రమేష్ వైద్యాధికారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హార్మూజ్ జలసంధిలో భారత నావికులకు అలర్ట్



**డెస్క్:** హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన భారత నావికులకు కేంద్ర ప్రభుత్వం అత్యవసర అడ్వయిజరీ జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా నౌకల నుంచి బయటకు రావద్దని స్పష్టంగా సూచించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాల్సిన అవసరాన్ని వెల్లడించింది. భద్రతా కారణాల దృష్ట్యా ఇరాన్ మరియు దాని పరిసర జలాల్లో ఉన్న భారత నావికులు సున్నిత ప్రాంతాలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు తప్ప ఎవరూ బయటకు రావద్దని సూచించారు. నౌకలలోనే ఉండటం ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవచ్చని స్పష్టం చేశారు. నౌకల్లో ఉన్న సిబ్బంది ఎప్పటికప్పుడు భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు కొనసాగించాలని కేంద్రం సూచించింది. ఇటీవల దాదాపు 40 రోజుల పాటు కొనసాగిన ఉద్రిక్తతల అనంతరం ఇరాన్, అమెరికా మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని నావికులకు సూచిస్తూ ముందస్తు చర్యలు చేపట్టింది. భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి సూచనను పాటించాలని స్పష్టం చేసింది. పరిస్థితులు సాధారణ స్థితికి చేరే వరకు నావికులు జాగ్రత్తగా వ్యవహరించాలని కేంద్రం పునరుద్ఘాటించింది.

## హెజ్బొల్లాపై ఐడీఎఫ్ దాడుల తీవ్రతరం



**బీరుట్:** లెబనాన్‌లో హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) దాడులను మరింత తీవ్రతరం చేసింది. హెజ్బొల్లా చీఫ్ నయీమ్ ఖాసిం మేనల్లుడు అలీ యూసఫ్ హర్షిని బీరుట్‌లో హతమార్చినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. హర్షి, ఖాసింకు అత్యంత సన్నిహితుడు కాగా, వ్యక్తిగత కార్యదర్శిగా కూడా పనిచేసినట్లు పేర్కొంది. అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజే ఈ దాడి జరగడం అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ మేరకు ఐడీఎఫ్ 'ఎక్స్' వేదికగా ప్రకటన విడుదల చేసి, హర్షి ఖాసిం కార్యాలయ నిర్వహణ, భద్రత వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించాడని వివరించింది. ఇదే సమయంలో, లిటాని నదికి దక్షిణంగా హెజ్బొల్లా ఉపయోగిస్తున్న రెండు కీలక మార్గాలతో పాటు, దక్షిణ లెబనాన్‌లో 10 ఆయుధ నిల్వ కేంద్రాలు, లాంచర్లు, కమాండ్ సెంటర్లను కూడా ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. ఈ దాడులతో ఆ ప్రాంతంలో భారీ నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఉత్తర ఇజ్రాయెల్ భద్రత విషయంలో రాజీపడబోమని ఐడీఎఫ్ చీఫ్ ఈయల్ జమీర్ స్పష్టం చేశారు. ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటూ హెజ్బొల్లాపై మరింత కఠిన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇదే సమయంలో, లెబనాన్‌పై దాడుల వీడియోను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సోషల్ మీడియాలో పంచుకుంటూ, "ఇజ్రాయెల్ పౌరులపై దాడులు చేసే వారిని పూర్తిగా నాశనం చేస్తాం" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

## కేసీఆర్ నగర్ 2 బి హెచ్ కే కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం



**కొల్లూర్, ఏప్రిల్ 9 (మన వార్త)** కొల్లూర్ కేసిర్ నగర్ 2బి హెచ్ కే కాలనీ, ఫేజ్-II ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ లోని దుకాణాలు అమ్మకూడదు, ఆ దుకాణాలని కెసిఆర్ నగర్ సొసైటీ వాసులకే చందేలాగా అద్దెకు మాత్రమే ఉండేలాగా అ డబ్బుని సొసైటీ కు ఉపయోగపడే విధంగా చేయగలరని కోరారు.కెసిఆర్ నగర్ చుట్టు బౌండరీ వాల్ తక్షణమే ఏర్యాటు చేయలని, స్మశాన వాటికకు కేటాయించిన స్థలము చుట్టూ బౌండరి వాల్ ను ఏర్పాటు చేస్తూ ఆ స్థలము కబ్జాకూ గురికాకుండా ఉంటుంది. వెంటనే అభివృధి వనులు ప్రారభించగలరని కోరారు. కెసిఆర్ నగర్ కొల్లూర్ 2బి హెచ్ కే ఫేస్ 2 ప్రాంతములో శానిటేషన్ సమస్యల పరిష్కారం, జెడ్ మిషన్ల ఏర్పాటు మరియు స్థానిక ప్రజలకు ఉప్పండి కల్పించుతా గురించి.మా ప్రాంతంలో సుమారు 20,000 కుటుంబాలు నివసిస్తునారు. వేరే ప్రాంతాలా నుండి ఇక్కడికి రావడం వల్ల వీరికి ఉపాధికూడలేదు. సిబ్బంది కోరాత కారణంగా మా ప్రాంతంలో శానిటేషన్ పనులు సరిగా జరగట్లేదు. 110 మంది శానిటేషన్ వర్కర్లు ఉండాల్సిన చోట, కేవలం 14 మందే పనిస్తున్నారు. డ్రైనేజీ క్లీనింగ్ సరిగా అవ్వట్లేదు. దీనవల్ల దోమల సమస్య విపరీతంగా పెరిగిపోయి, ప్రజల తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. వెంటనే ఈ సమస్య పరిష్కరించాలి, శానిటరీ సూపెర్వైజారుగా ఇక్కడి నివాసులకే ప్రార్ధన్యత ఇవ్వాలని కోరారు.దీనివల్ల ఉపాధి సమస్యతో వాటు శానిటేషన్ సమస్య కూడా పరిష్కారమవుతుంది. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, బానోతు కోటేష్ నాయక్ తెలంగాణ ఉద్యమ కారుడు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిరికొండలో భారీ హిందూ సమ్మేళనం ధార్మిక చైతన్యానికి వేదిక



**సిరికొండ, ఏప్రిల్ 09 (మన వార్త)** సిరికొండ మండలం ఏప్రిల్ 20, 2026న భారీ స్థాయిలో హిందూ సమ్మేళనం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయి. సాయంత్రం 5:00 గంటలకు అంగడి బజార్‌లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.ఈ సమ్మేళనం ద్వారా హిందూ ధర్మ పరిరక్షణ, సాంప్రదాయాల ప్రాచుర్యం, సమాజ ఐక్యతకు పునాది వేయడం లక్ష్యంగా హిందూ సమ్మేళనం అధ్యక్షులు తాళ్ళ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక వక్తలు హాజరై సందేశాలు అందించనున్నారు.ముఖ్య అతిథులుగా శ్రీ శ్రీ ఉదయ్ మహారాజ్ గారు (యోగధారణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హిందూ ధర్మ ప్రచారకులు, బోధన్)శ్రీహరి పన్నంవార్ గారు ("శ్రీరామ్ హనుమాన్ సేన" రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హిందూ ధర్మ ప్రచారకులు, ఇందూరు)పాల్గొని ధార్మిక విషయాలపై ప్రసంగాలు చేయనున్నారు.కార్యక్రమంలో భాగంగా భజనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించబడనున్నాయి. భారీ సంఖ్యలో భక్తులు, యువత పాల్గొనే అవకాశం ఉందని హిందూ సమ్మేళనం కమిటీ అధ్యక్షులు తాళ్ళ శ్రీనివాస్ తెలిపారు.కార్యక్రమం అనంతరం అన్న సత్రం కూడా ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సహకరించాలని హిందూ సమ్మేళనం కమిటీ అధ్యక్షులు తాళ్ళ శ్రీనివాస్ కోరుతున్నారు.



## మల్లారెడ్డిపేటకు సబ్ స్టేషన్ను మంజూరు...

**-హర్షం వ్యక్తం చేసిన గ్రామ సర్పంచ్ మహేష్ ఏఎంసి వైస్ చైర్మన్ అంజిరెడ్డి...**

**గంభీరావుపేట /మన వార్త /ప్రతినిధి ఏప్రిల్ 9** గంభీరావుపేట మండల కేంద్రంలోని మల్లారెడ్డిపేట గ్రామనికి 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు 3 కోట్ల 10 లక్షలతో సబ్ స్టేషన్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం హర్షం వ్యక్తం చేస్తు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. మంత్రి పొన్నం ప్రభాకర్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డి. ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్రామ సర్పంచ్ ఛీకోటి మహేష్ యాదవ్. ఏఎంసి వైస్ చైర్మన్ పాతూరి అంజిరెడ్డి. ఉప సర్పంచ్ వెతుకు బాబు. గ్రామ శాఖ అధ్యక్షులు సతీష్ రెడ్డి. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.నూతన విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు కావడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా తెలంగాణలో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో లోడ్ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం పలు ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్లను మంజూరు. చేస్తోంది.కొత్త సబ్ స్టేషన్ల ఏర్పాటుకు రూ. 3.కోట్లు10 లక్షలు నిధులు మంజూరయ్యాయి.సబ్ స్టేషన్ మంజూరు వివరాలు:ముఖ్య ఉద్దేశం: విద్యుత్ లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడం రైతులకు, గృహ వినియోగదారులకు తక్కువ వోల్టేజ్ సమస్యల నుండి ఉపశమనం.ఈ సబ్ స్టేషన్ ద్వారా గ్రామంలో విద్యుత్ అవసరాలను తీర్చనున్నారు తెలిపారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

**-జాగృతి నాయకులు కూర సురేష్...**

**గంభీరావుపేట/మన వార్తా /ప్రతినిధి ఏప్రిల్ 9** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని లక్ష్మీపూర్ తండా. నాగంపేట దమ్మన్నపేట తో పాటు పలు గ్రామాలలో రైతులు కోత కోసి ధాన్యం 15 రోజులుగా ఆరబెట్టుకుంటున్నారు. ధాన్యం ఆరబెట్టుకుంటుకొన్న కళ్ళల్లో ధాన్యాన్ని జాగృతి నాయకులు కూర సురేష్ సందర్శించి రైతులతో మాట్లాడారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలతో పాటు లక్ష్మీపూర్ తండా . నాగంపేట దమ్మన్నపేట తో పాటు అనేక గ్రామాలలో రైతులు ముందస్తు సాగు చేసుకుని వరి కోతలు కోసి దాన్యమును కొనుగోలు కేంద్రాలలోకి తీసుకువచ్చి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అకాల వర్షాలు కురిస్తే రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారని జిల్లా మండల అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ పరిశీలనలో రైతులు. పాల్గొన్నారు.



## ఘనంగా కేసరి హనుమాన్ దేవాలయం వార్షికోత్సవ వేడుకలు



**గజ్వేల్ ఏప్రిల్ 09 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని ( వాగు గడ్డ) కేసరి హనుమాన్ దేవాలయంలో వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు, గురువారం ఆలయంలో రుద్రాభిషేకం, చండీ హవనం, మహా పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించి శివపార్వతుల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్నప్రసాద అందజేశారు, ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న గజ్వేల్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కొమురవెల్లి శంకరయ్య, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేసరి హనుమాన్ స్వామి అనుగ్రహంతో అందరూ బాగుండాలని వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారని నిర్వాహకులను అభినందించారు, ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని, దైవ నామస్మరణతోనే మానవ జీవితానికి ముక్తి కలుగుతుందని అన్నారు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలకు సహకరిస్తున్న దాతలకు సన్మానించారు అందులో భాగంగా కొమురవెల్లి శంకరయ్యకు చిరు సన్మానం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నాయిని ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్, జయసింహా, పిచ్చయ్య, హనుమాన్ దీక్షా స్వాములు, పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**గంభీరావుపేట/మన వార్త/ప్రతినిధి ఏప్రిల్ 9** గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల గంభీరావుపేటలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి మరియు అల్యూమిని కోఆర్డినేటర్ జె శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సమావేశంలో 25 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని తన అనుభవాలను వివరించడం జరిగింది.ఈ సమావేశంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి గారు మాట్లాడుతూ కళాశాల లో అలుమని (Alumni) కీలక పాత్ర వహిస్తుందని, ప్రస్తుత విద్యార్థులకు అలుమని మార్గ నిర్దేశంగా ఉండాలని సూచించారు. అలుమని ప్రెసిడెంట్ దోసల శంకర్ మాట్లాడుతూ అప్పుడు తాము చదువుకున్నప్పటి వసతుల కంటే ప్రస్తుతం అన్నీ సౌకర్యాలు ఉన్నందున సద్వినియోగపరచుకొని ఉన్నత ఉద్యోగాలు పొందాలని కోరాడు. పూర్వ విద్యార్థి ఎష్ట్ర రవి గారు మాట్లాడుతూ మేము చదువుకునే సమయంలో అధ్యాపకులు గాని, లైబ్రరీ గాని, ల్యాబ్స్ గాని లేనటువంటి పరిస్థితుల్లోనే మేము కష్టపడి చదివి ఈరోజు జూనియర్ కళాశాల అధ్యాపకునిగా పని చేసే స్థాయికి వచ్చానంటే ఈ కళాశాల యొక్క గొప్పతనమని తెలిపారు.ప్రస్తుతం బోటనీ అధ్యాపకుడిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల గంభీరావుపేట లో పనిచేస్తున్నాడు.పూర్వ విద్యార్థి మరియు గర్ల్స్ హై స్కూల్ ఉపాధ్యాయుడు ఎ. బ్రహ్మచారి గారు మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకొని, క్రమశిక్షణతోని పట్టుదల కలిగివుంటే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు.ఈ సమావేశానికి హాజరైన అల్యూమిని సభ్యులందరు కలిసి జూలైలో పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించుకుంటామని తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక అధ్యాపకేతర బృందం విద్యార్థిని విద్యార్థులందరు పాల్గొన్నారు.

## ప్రశ్నించి పోరాడటమే మా పార్టీ లక్ష్యం

**-కవిత నూతన రాజకీయ పార్టీ రాష్ట్ర భవిష్యత్, చరిత్రను మార్చే పార్టీగా నిలుస్తుంది...**

**-పార్టీ జెండా ఆవిష్కరణ సభ గోడ పోస్టర్లను ఆవిష్కరించిన జాగృతి నేతలు...**

**మధిర, ఏప్రిల్ 9( మన వార్త ):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్థాపించబోయే నూతన రాజకీయ పార్టీ ప్రధాన ఉద్దేశం ప్రశ్నించటం,పోరాడటమే తమ పార్టీ పంథా అని జాగృతి రాష్ట్ర కార్యదర్శి బాదావత్ కిషన్ నాయక్,జాగృతి జిల్లా అధ్యక్షురాలు గట్టు కరుణ, జాగృతి మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ పగిడిపల్లి వినోద్ పేర్కొన్నారు.గురువారం జాగృతి ముఖ్య కార్యకర్తల సమావేశం మధిర రిక్రియేషన్ క్లబ్ జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న జాగృతి నేతలు కిషన్ నాయక్,కరుణ,వినోద్ మాట్లాడారు.ఈనెల 25న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్థాపించబోయే నూతన రాజకీయ పార్టీ రాష్ట్ర భవిష్యత్‌ను,చరిత్రను మార్చే పార్టీగా నిలుస్తుందన్నారు.హైదరాబాద్ నగర శివారులోని మేడ్చల్ జిల్లా మునీరాబాద్ గ్రామం అద్వయ కన్వెన్షన్ హాల్‌లో జరిగే భారీ సభ వేదికగా పార్టీ జెండా ఆవిష్కరణ చేస్తామని తెలిపారు.ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు.ఇక తమ పార్టీ ఆవిర్భావ సభకు తెలంగాణ జాగృతి నాయకులు,కార్యకర్తలు, మధిర నియోజకవర్గ ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో మార్పు కావాలని కోరుకునే వారంతా తమ నూతన పార్టీతొ కలిసి రావాలని వారు కోరారు.ఈ సందర్భంగా నేతలు కవిత నూతన పార్టీ జెండా ఆవిష్కరణ,సభ గోడా పోస్టులను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జాగృతి నేతలు కూరపాటి సురేష్,కొల్లా రఘురామ్,వేమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి,దుంపల మనోహర్,బెజ్జం జలంధర్, సాయి,పుల్లారావు,రవి,బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



**గంభీరావుపేట/మన వార్త/ప్రతినిధిఏప్రిల్ 9** గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల గంభీరావుపేటలోకెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 50 మంది విద్యార్థులు ఇంటర్వ్యూల హాజరు కాగా 15 మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ జె శ్రవణ్ కుమార్ లు తెలిపారు.. ఈరోజు డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకోబోతున్న విద్యార్థులకు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో క్యాస్ కార్ప్, అపోలో హాస్పిటల్, ముత్తూట్ ఫైనాన్స్, టీం లీజ్ తదితర కంపెనీల ప్రతినిధులు మరియు మ్యాజిక్ బస్ ప్రతినిధులు రమేష్,నరేష్ పాల్గొన్నారు. వివిధ కంపెనీలకు ఎన్నికైన 15 మంది విద్యార్థులకు గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గౌరవనీయులు మల్లుగారి పద్మ నర్సాగౌడ్, ఉపసర్పంచ్ నా. కమలాకర్ రెడ్డి చేతుల మీదుగా అంద చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం ప్రభాకర్, డాక్టర్ వై ఆంజనేయులు, పాక ధర్మపురి, వి. వాణి, డాక్టర్ ఆదివిష్ణు, డాక్టర్ కె వి బిక్షమయ్య, మనోహర్, సుచరణ్ శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్ తదితర అధ్యాపక అధ్యాపకేత్ర బృందం పాల్గొన్నారు

## సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్...



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ -09 (మన వార్త )**సబ్ స్టేషన్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్థల పరిశీలన చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమీపంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాలను గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఎన్పీడీసీఎల్ సీఈ అశోక్ తో కలిసి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, కలెక్టర్ పలు సూచనలు చేశారు.పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, సిరిసిల్ల డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వైర్ల తొలగింపుతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఊపిరి



**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో శాశ్వత పరిష్కారం...**

**-కృతజ్ఞతలు తెలిపిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు బింగి రేణుక....**

**వేములవాడ ఏప్రిల్ 09 (మన వార్త )**వేములవాడ పట్టణంలోని కోరుట్ల రోడ్ భీమేశ్వర ఫంక్షన్ హాల్ సమీపంలో ప్రమాదకరంగా వెళ్లిన విద్యుత్ వైర్లు కారణంగా ఆగిపోయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఊరట లభించింది.. లబ్ధిదారురాలు బింగి రేణుకకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి పైనుండి విద్యుత్ లైన్ వెళ్లడంతో పనులు నిలిచిపోయాయి. సమస్య పరిష్కారం కోసం రేణుక ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఆది శ్రీనివాస్, టీఎస్ ఎన్‌పీడీసీఎల్ అధికారులతో ఫోన్లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకునేలా ఆదేశించారు. గురువారం టీఎస్ ఎన్పీడీసీఎల్ అధికారులు ప్రమాదకర విద్యుత్ లైన్‌ను తొలగించడంతో ఇంటి నిర్మాణానికి ఉన్న అడ్డంకి తొలగిపోయింది. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో లబ్ధిదారురాలు రేణుక ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను పరిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు, వార్డు కౌన్సిలర్ సంగీత- శ్రీకాంత్ కు బింగి రేణుక కృతజ్ఞతలు తెలిపారు...

## సబ్ స్టేషన్ స్థలాన్ని పరిశీలించిన సర్పంచ్ మహేష్ యాదవ్



**గంభీరావుపేట/మన వార్త/ప్రతినిధి ఏప్రిల్ 9** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామనికి 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు 3 కోట్ల 10 లక్షలతో సబ్ స్టేషన్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం హర్షం వ్యక్తం చేస్తు సబ్ స్టేషన్ స్థలాన్ని గ్రామ సర్పంచ్ మహేష్ యాదవ్ ఉపసర్పంచ్ బాబు. కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీముని మల్లారెడ్డిపేట గ్రామంలో లో వోల్టేజ్ విద్యుత్ సమస్య పంట పొలాల్లో గృహాలల్లో తరచుగా ఏర్పడుతుందేదని మా గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరుకు కృషిచేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. మంత్రి పొన్నం ప్రభాకర్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డి. ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారులకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఛీకుటి మహేష్ యాదవ్.ఉప సర్పంచ్ వెతుకు బాబు. ఏఎంసి వైస్ చైర్మన్ పాతూరి అంజిరెడ్డి.. గ్రామ శాఖ అధ్యక్షులు సతీష్ రెడ్డి. కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి జలాలతో రైతుల ఆశలు నెరవేర్చిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**-నీళ్లు వచ్చిన రోజు పండగడ ఆ రోజు తీసుకొచ్చిన నేత ఆది శ్రీనివాస్....**

**వేములవాడ ఏప్రిల్ 09 (మన వార్త )**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని ఎదురుగట్ల



గ్రామ చెరువులో గోదావరి జలాలు చేరడంతో గ్రామం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. చెరువు నిండుగా నీటితో కళకళలాడుతుండగా, గంగమ్మ తల్లికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ□ఎదురుగట్ల చెరువుకు గోదావరి జలాలు చేరడం వెనుక ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిరంతర శ్రమ, దూరదృష్టి ఉందని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం పట్ల ఆయన చూపుతున్న చిత్తశుద్ధి వల్లే ఈ రోజు చెరువు నిండుగా నీటితో కళకళలాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో. మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.సోయినేనీ కరుణాకర్. గ్రామ సర్పంచ్ కదారి తిరుపతి సంధ్య.అడిక శ్రీనివాసరెడ్డి జైపాల్ రెడ్డి పొన్నం మల్లేశం నేదూరీ నరసయ్య పాలకుర్తి శంకరయ్య రోమాల ప్రవీణ్ వంగపల్లి మల్లేశం గంగారెడ్డి భూమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ప్రకాష్ రామస్వామి బాలయ్య కిషన్ నాగేందర్ నాగరాజు కొమురయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచ్లు.రైతులు పాల్గొన్నారు

# రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలి..




**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ -09 (మన వార్త )**జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యాచరణలో వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ర్యాలీ అంబేద్కర్ చౌక్ నుంచి బతుకమ్మ ఘాట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా అన్ని ప్రభుత్వ దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, రోగులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ఇంకా మెరుగైన వైద్య సేవల కోసం కరీంనగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేయాలని ఆదేశించారు. ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఎయిడ్స్ నియంత్రణపై అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్యం, మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ట్రాన్స్ జెండర్స్ కోసం ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రజిత, జీ జీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగు నిశీపడమే ప్రభుత్వ ధ్యేయం....


**-ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు**

**మన వార్త** పేదల జీవితాల్లో వెలుగు నింపడమే ప్రభుత్వ ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



అన్నారు.గురువారం చిన్న శంకరంపేట మండలం మదూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని, పేదల జీవితాలలో వెలుగు నింపడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలని తెలిపారు. పేదోడి సొంతింటి కల నెరవేరేందుకే ఇందిరమ్మ ఇండ్ల పథకం తేవడం జరిగిందని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆయాంలోనే ఏ ఊరికి వెళ్ళిన ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడం జరిగిందని మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలోనే ప్రతి గ్రామంలో పేదోడికి ఇండ్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్ లు, పార్టీ నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన మెదక్ ఎమ్మెల్యే...



**మన వార్త** కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం పేదలకు ఒక వరం లాంటిదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాల ప్రవేశ పెట్టడం జరిగిందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ అన్నారు, చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 19 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, చెక్కులను మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ చేతుల మీదుగా పంపిణీ చేశారు, అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాజిరెడ్డి, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్, లు మాట్లాడుతూ ప్రభుత్వశీ ఏర్పాటైన రెండు సంవత్సరాలలోపు పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని అన్న అంటే నేనున్నానంటూ మైనంపల్లి కుటుంబం ఎం ఎస్ ఎస్ ఓ ద్వారా ఎంతో మంది పేద ప్రజలను తన సొంత డబ్బులు వెచ్చించి ఆదుకోవడం జరిగిందని, మైనంపల్లి కుటుంబం అంటేనే సేవకు పెట్టిన పేరని తల్లి తండ్రి లేని అనాథ పిల్లలకు ఒక్కొక్కరికి 25వేల చొప్పున ఎంతోమందికి ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్లు అందించడం జరిగిందని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు, సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మోహన్ నాయక్, కామారం ఉపసర్పంచ్ సుధాకర్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు సాన సత్యనారాయణ, యాదవరావు, లింగమూర్తి, రమేష్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, చిరంజీవి, నాగరాజు, తీగుళ్ల బిక్షపతి, రాజ్ కుమార్ గౌడ్, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి పది సంవత్సరాలు [10] జైలు శిక్ష



**వేములవాడ ఏప్రిల్ 09 (మన వార్త )**మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన (పోక్సో) కేసులో నిందుతుడీకి పది సంవత్సరాలు జైలు,5000/- రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ గురువారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.కేసు వివరాలు..వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక మైనర్ అమ్మాయిను A2) ఎదురుగట్ల అజయ్ s/o ఎల్లయ్య, 27yrs, r/o అంబేద్కర్ నగర్,వేములవాడ అతను A1 అయిన గౌరవేణి నాగరాజు(జువేనైల) కలిసి కిడ్నప్ చేసి బలవంతపు వేధింపులకు పాల్పడగా విక్టీమ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అప్పటి వేములవాడ డిఎస్పీ వెంకటరమణ దర్యాప్తు అనంతరం నిందితుడి రిమాండ్ చేసిన అనంతరం కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగింది. కోర్టు తీర్పు...కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ మహేందర్, cms కనిస్టేబుల్ నవీన్ లు కోర్టులో 18 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదించారు.శాస్త్రీయ ఆధారాలు మరియు సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడైన A2.ఎదురుగట్ల అజయ్ కు పది సంవత్సరాల జైలుతో పాటు 5000/- రూపాయల జరిమానా విధించడం జరిగింది.ఇట్టి కేసులో A1 అయినటువంటి గౌరవేణి నాగరాజు(జువేనైల్) కావడంతో అతనిపై కేసు జువినల్ కోర్టులో నడుస్తున్నది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకొలేరని,శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని, పోలిసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు ఈకేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి విచారణ అధికారి డిఎస్పీ వెంకటరమణ, ప్రస్తుత సి.ఐ వీరప్రసాద్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్,కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు,కోర్టు కానిస్టేబుల్ మహేందర్,సి ఎం ఎస్ కానిస్టేబుల్స్ నవీన్, వెన్నెల లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## 1.80 కోట్లతో సీసీ రోడ్లు పనులను ప్రారంభించిన లక్ష్మీదేవిపేట గ్రామ సర్పంచ్ బొమ్మకంటి వంశావతి-రమేష్



**వెంకటాపూర్ రామప్ప ఏప్రిల్ 9 మన వార్తా ప్రతినిధి** లక్ష్మీదేవిపేట గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న మంత్రి సీతక్క కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాము తెలంగాణా రాష్ట్ర పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధి,స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రివర్యులు-శ్రీమతి.ఐతీ,,దనసరి.అనసూయ(సీతక్క) ఆదేశాలమేరకు,జిల్లా అధ్యక్షులు-పైడాకుల.అశోక్ సూచనలమేరకు ఈరోజు వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో 1.80 కోట్ల రూపాయల సీసీ రోడ్ల పనులను కొబ్బరికాయ కొట్టి,ప్రారంభం చేసిన లక్ష్మీదేవిపేట గ్రామ సర్పంచ్/బొమ్మకంటి.వంశావతి-రమేష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,,మంత్రివర్యులు-సీతక్క చొరవతో ఇప్పటివరకు గ్రామ అభివృద్ధిలో భాగంగా 4 కోట్ల రూపాయల పనులు జరుగగా,ఇప్పుడు కూడా మళ్లీ 1.80 కోట్లతో ప్రత్యేక చొరవతో మాపై నమ్మకంతో మంజూరు చేయించిన సీతక్క కి మేము మరియు మా లక్ష్మీదేవిపేట గ్రామ ప్రజలందరూ మంత్రి-సీతక్క కి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎల్లవేళలా కృషిచేస్తామని,రుణపడి ఉంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోపాటు ఉపసర్పంచ్,పాలకవర్గం మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,జిల్లా మండల నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు,మహిళా సోదరీమణులు మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులను పరామర్శించిన సర్పంచ్ రామ్మోహన్



**ములుగు జిల్లా ఏప్రిల్ 9 మన వార్త ప్రతినిధి** మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరక చరవాణిలో బాధితుల ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్న మంత్రి సీతక్క వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చార వరంగల్ లలిత హాస్పిటల్ నందు గోవిందరావుపేట మండల రాఘవపట్నం గ్రామానికి చెందిన రామటెంకి రాజశేఖర్ మరియు ప్రవీణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా వారిని రాఘవపట్నం గ్రామ సర్పంచ్ కోరం రామ్మోహన్ పరామర్శించి, బాధితులతో మంత్రి సీతక్క చరవాణిలో మాట్లాడి, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే వైద్యశాల సిబ్బందితో మాట్లాడి వారికి నాణ్యమైన చికిత్స అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ సెల్ మండల నాయకులు జాకీర్ తో పాటుగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్ దివాకర్ టి. ఎస్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన గొల్లపల్లి రాజేందర్



**ములుగు జిల్లా ఏప్రిల్ 9 మన వార్తా ప్రతినిధి** తెలంగాణా రాష్ట్ర పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధి,స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రి.Dr.దనసరి.అనసూయ (సీతక్క) ఆదేశాలమేరకు,జిల్లా అధ్యక్షులు-పైడాకుల.అశోక్ సూచనలమేరకు ములుగు జిల్లా కలెక్టర్-దివాకర టీ.ఎస్ పుట్టినరోజు సందర్భంగా వారిని కలిసి శాలువాతో సన్మానించి,చిరు కానుకను అందించి,జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ ములుగు నియోజకవర్గ కో-ఆర్డినేటర్,కూడా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు-గొల్లపల్లి.రాజేందర్ గౌడ్ వారితోపాటు,,జిల్లా కార్యదర్శి-నూనేటి.శ్యాం యాదవ్,3వ వార్డు కౌన్సిలర్-యాసం.రవి,PACS మాజీ డైరెక్టర్-రఘు,మండల నాయకులు-సారయ్య మరియు తదితర నాయకులు పాల్గొన్నారు

## పుస్తకాలకే కాదు పంట పొలాల్లో ప్రత్యక్షంగా వ్యవసాయం నేర్చుకున్న విద్యార్థులు



**సిరికొండ, ఏప్రిల్ 09 (మన వార్త)** సిరికొండ మండల కేంద్రంలోని పీయం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల,జూనియర్ కళాశాల విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు ప్రత్యక్షంగా పంట పొలాల్లోకి వెళ్లి వ్యవసాయాన్ని నేర్చుకుంటున్నారు. వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్న్షిప్ కార్యక్రమంలో భాగంగా 9వ రోజు ఫీల్డ్ విజిట్ చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సిరికొండలోని రైతు ధర్పల్లి బాబురావు పంట పొలాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న వ్యవసాయ పనులను దగ్గరగా పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి కూరగాయల సాగు విధానాలు, పంటల సంరక్షణ పద్ధతులు, నీటి వినియోగం వంటి అంశాలను ప్రత్యక్షంగా అవగాహన చేసుకున్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, పుస్తకాల ద్వారా పొందే జ్ఞానంతో పాటు ప్రాక్టికల్ అనుభవం కూడా విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇలాంటి ఫీల్డ్ విజిట్లు విద్యార్థుల్లో వ్యవసాయంపై ఆసక్తిని పెంచి, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వ్యవసాయాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు.అదేవిధంగా వరి పంటలో కోతకు ముందరి సంరక్షణ (ప్రి హార్వెస్టింగ్ కేర్) గురించి కూడా విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ ఫీల్డ్ విజిట్ ద్వారా విద్యార్థులు పొలం నుంచే ప్రత్యక్షంగా నేర్చుకుని విలువైన అనుభవాన్ని సొంతం చేసుకున్నారని ఉపాధ్యాయులు తెలిపారు.

## మన ఊరు మన పోలీస్ కార్యక్రమంతో గ్రామాల్లో భద్రతకు బలం

**-సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసుల పిలుపు. యువతకు జాబ్ మేళా సమాచారం...**

**కోహెడ ఏప్రిల్ 09 (మన వార్త ప్రతినిధి )**నేరాల నివారణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని సిద్దిపేట జిల్లా కోహెడ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.మన ఊరు




మన పోలీస్ కార్యక్రమంలో భాగంగా విపిఓ అధికారులు గ్రామాలను సందర్శించి, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పోలీస్ అధికారులు, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టవచ్చని తెలిపారు.ప్రతి గ్రామంలో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. అలాగే నిరుద్యోగ యువత కోసం సిద్దిపేటలో నిర్వహించనున్న పోలీస్ ఉద్యోగమిత్ర మెగా జాబ్ మేళా గురించి వివరించి, అర్హులైన యువత ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ప్రజలకు పోలీస్ సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా “మన ఊరు మన పోలీస్” కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి సీతక్క



**ములుగు జిల్లా ఏప్రిల్ 9 మన వార్తా ప్రతినిధి** మహబూబాబాద్ జిల్లా మండలం సీతంపేట గ్రామంలో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు మంత్రి సీతక్క సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ భానోత్ రాంబాబు ,ప్రజా ప్రతినిధులు చైర్మన్లు డైరెక్టర్లు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కౌకూర్‌లో సీసీ రోడ్డు పనుల పరిశీలన



**మేడ్చల్ మల్కాజ్‌గిరి, ఏప్రిల్ 9 మన వార్త :**మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంత రావు నాయకత్వంలో, సౌజన్యపూర్వక అభ్యర్థనపై మల్కాజ్గిరి జోన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఐఎఎస్ కౌకూర్ లోని మోడల్ మార్కెట్, మహిళా మండల్ వద్ద కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. కౌకూర్, మహాదేవపూర్ ప్రాంతాల నివాసితులు రోడ్డు ఆక్రమణలు మరియు ఇరుకైన అంతర్గత రహదారుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు చేరుకోలేని పరిస్థితి ఉండటం, స్కూల్ బస్సులు, ఆటోలు వంటి వాహనాలు ప్రవేశించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వివరించారు. ఈ సమస్యలను మల్కాజ్గిరి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెల్ల మల్లికార్జున మైనంపల్లి హనుమంత రావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి జోనల్ కమిషనర్ ని సమస్య పరిష్కారంపై దృష్టి సారించవలసిందిగా వినమ్రంగా కోరారు. దీనికి స్పందించిన జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ స్వయంగా స్థలాన్ని సందర్శించి, పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించారు. కౌకూర్ మహాదేవపూర్ ప్రాంత అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తుడిమెల్ల మల్లికార్జున మాట్లాడుతూ, ఈ రహదారి 300కు పైగా ఇళ్లకు ఏకైక మార్గమే కాకుండా అనేక అంతర్గత వీధులను అనుసంధానించే ముఖ్యమైన దారిగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ తరాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రహదారిని విస్తరించి అభివృద్ధి చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే మైనంపల్లి హనుమంతరావు సమగ్ర అభివృద్ధి దృక్పథాన్ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి జోన్ ఇంజినీరింగ్ అధికారులు ఎస్.సి. లక్ష్మయ్య, డి.ఈ. పద్మలత, ఏ.ఈ. సత్యలక్ష్మి, వర్క్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు వెంకటేశ్ గౌడ్, వెంకట్ రెడ్డి, సంజీవ రెడ్డి, సత్తి రెడ్డి, రమేష్, మహేష్, కిరణ్, కృష్ణ, ఫహీమ్, ఆరిఫ్, సాయి, హరినాథ్, నవీన్ తదితరులు మరియు అనేక మంది స్థానికులు హాజరయ్యారు.

## పెండింగ్ పనులపై కమిషనర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి




**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, ఏప్రిల్ 9 మన వార్త:** మల్కాజ్గిరి ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మల్కాజ్‌గిరి కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ని కలిసి పలు ప్రజా సమస్యలపై ప్రతినిధి పత్రం రిప్రెజెంటేషన్ అందజేశారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ప్రాంతంలో బస్ షెల్టర్ల కొరతపై ఆయన దృష్టి ఆకర్షించారు. ప్రయాణికులు ఎండ, వర్షాలలో ఇబ్బందులు పడుతున్నందున తక్షణమే కొత్త బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, దోమల సమస్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఫాగింగ్, శానిటేషన్ చర్యలు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, కొన్ని కాలనీలలో కొత్త ఎలక్ట్రిక్ పోల్స్ అవసరం ఉందని తెలియజేసి, వీటి ఏర్పాటు ద్వారా రోడ్లపై భద్రత మెరుగుపడుతుందని సూచించారు. ముఖ్యంగా లోతుకుంట ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న బాక్స్ డ్రైన్ పనులపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ పనులు పూర్తయితే వరద నీటి సమస్య తగ్గి, కాలనీవాసులకు ఎంతో ఉపశమనం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## నేడే జౌళి శాఖ ఆద్వర్యంలో చేనేతలకు రుణమాఫీ చెక్కుల పంపిణీ

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేనేత మరియు జౌళి శాఖ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో 10 ఏప్రిల్ 2026 తేదీన ఉదయం 10:30 గంటలకు రాయగిరి లింగ బసవలింగ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించ బడుతుంది. సమావేశంలో ఆయా నియోజకవర్గాల చేనేత కార్మికులకు ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్న బీమా , నేతన్న భరోసా , మరియు రుణ మాఫీ పథకాల కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు ఆలేరు నియోజకవర్గం బీర్ల ఆయిలయ్య , భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా నిర్వహించబడుతుంది. ఇట్టి కార్యక్రమానికి నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం , భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి , తుంగతుర్తి శాసనసభ్యులు మందుల శామ్యూల్ హాజర వుతున్నారు. కావున ఈ కార్యక్రమానికి చేనేత నాయకులు , కార్మికులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయ వలసిందిగా యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత , జౌళి శాఖ కోరనైనది.

## హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ అవగాహన ర్యాలీ...

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహిస్తున్న హెల్త్ వీక్ డే4 లో కార్యక్రమాలలో భాగంగా గురువారం రోజు హెచ్ఐవి , ఎయిడ్స్ అవగాహన , నివారణ కార్యక్రమాలు విజయవంతం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 8:00 గంటలకు భువనగిరి పట్టణంలో మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ జీజీహెచ్ హాస్పిటల్ నుండి జగదేవ్‌పూర్ చౌరస్తా వరకు హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కలిగించే నినాదాలతో నిర్వహించబడం జరిగింది ఈ ర్యాలి అవగాహన కార్యక్రమాలలో 105 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పలు ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించ బడ్డాయి. అవి లేబర్ అడ్డా వద్ద హై రిస్క్ గ్రూపులకు హెచ్ఐవి టెస్టింగ్ క్యాంప్ నిర్వహించగా 81 మంది పాల్గొన్నారు. భువనగిరి సబ్ జైల్‌లో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో 8 మంది ఖైదీలకు హెచ్ఐవి , సిఫిలిస్ పరీక్షలు నిర్వహించడం జరిగింది. టిబి స్క్రీనింగ్‌లో 15 మందిని పరిశీలించగా , హెపటైటిస్ బి & సి పరీక్షలు 8 మందికి నిర్వహించడం జరిగింది. అదే విధంగా జైలులోని 8 మందిని ఖైదీలకు ఎన్ సి డి స్క్రీనింగ్ పరీక్షించ గా అందులో 1 వ్యక్తికి హైపర్‌టెన్షన్ గా గుర్తించ బడింది. ట్రాన్స్ జెండర్‌ల కోసం జి జి హెచ్ యాదాద్రి భువనగిరి వద్ద మైత్రి హెల్త్ క్యాంప్ లో 13 మందికి ట్రాన్స్ జెండర్‌లకి స్క్రీనింగ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఒక్కరు ఎయిడ్స్ వ్యాధిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హెచ్ఐవి వైరస్ శరీరంలోని రోగనిరోధక శక్తిని తగ్గి స్తుందని , ఎయిడ్స్ అనేది ఆ వ్యాధి యొక్క చివరి దశ అని వివరించారు. అసురక్షిత శృంగారం , కలుషిత రక్తం మార్పిడి , అలాగే వాడిన సూదులను మళ్లీ ఉప యోగించడం ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని చెప్పారు. సురక్షిత పద్ధతులు పాటించడం , కొత్త సూదులను మాత్రమే వినియోగించడం ద్వారా దీనిని నివారించ వచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ (ఏ&ఎల్) , డాక్టర్ విజయ పటేల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రీతి స్వరూప్ ఫిజియోథెరపిస్ట్ , డాక్టర్ సాగరిక , డాక్టర్ డేవిడ్ , శైలజ సిడిపిఓ , సబ్ జైల్ సూపరింటెండెంట్ నెహ్రూ నాయక్ , డా. నిరోష , డా. నితిష , గాయత్రి ఆప్టోమెట్రిస్ట్ , నీడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ భాను , ఐసిటిసి సూపర్‌వైజర్ సంపత్ మరియు సిబ్బంది , ఆర్ ఎన్ టి సి పి (టిబి) సిబ్బంది , యు పి హెచ్ సి సిబ్బంది , ఆశా వర్కర్లు , ఏఎన్ఎంలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కార్మిక సంక్షేమానికి కట్టుబాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

**–లేబర్ కార్డుల పంపిణీ, సీసీ రోడ్డు పనుల పరిశీలన, చలివేంద్రం ప్రారంభం...**

**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, ఏప్రిల్ 9 మన వార్త :** కార్మికుల సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి పట్ల తన కట్టుబాటును




మరోసారి చాటుతూ మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అల్వాల్ సర్కిల్ పరిధిలో విస్తృత పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చ బొల్లారం, వెంకటాపురం, కానాజీగూడా ప్రాంతాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. వెంకటాపురం డివిజన్‌లోని ఇందిరానగర్ లేబర్ అడ్డ వద్ద బీఆర్ఎస్ నాయకుడు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన లేబర్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన కార్మికులకు స్వయంగా కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, కార్మికుల సంక్షేమం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కానాజీగూడా ప్రాంతంలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల నాణ్యతపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేస్తూ, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రాంతీయ అభివృద్ధిలో భాగంగా మెరుగైన రహదారులు, మౌలిక సదుపాయాల కల్పన తన ముఖ్య ధ్యేయమని తెలిపారు. తదుపరి మచ్చ బొల్లారం మార్కెట్‌లోని సూర్య టెంట్ హౌస్ వద్ద డాక్టర్ నార్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన లేబర్ కార్డులు, ఈ-శ్రమ్ కార్డులు మరియు ఆభా కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనేక మంది లబ్ధిదారులకు కార్డులను అందజేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను వివరించారు. అదే కార్యక్రమంలో భాగంగా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలలో బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, డిల్లీ పరమేష్, లక్ష్మణ్, పవన్, రేవంత్, ప్రశాంత్ రెడ్డి, అధిక్ బాషా, మహేష్, భాస్కర్ గౌడ్, శరణగిరి నర్సింగరావు, సురేష్ సంపత్, నర్సింగ్ రావు, సుదర్శన్, అశోక్, శ్రీనివాస్, ముత్యాలు, రవి, విజయ్, రాజు, హరి, గోపాల్ నాయక్, సురేష్ రెడ్డి, శ్రీలత, అమృత, సరిత, రాధ, రేణుక, మంగమ్మ, శారద, సులోచనతో పాటు అనేక మంది కార్మికులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్మికులకు భరోసా అభివృద్ధికి అడుగులు ఈ పర్యటన ద్వారా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కార్మికుల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై తన దృష్టిని మరింత బలంగా చాటారు. స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పాలన సాగేది ఎలా శిథిలావస్థలో సిరికొండ ఎంపీడీవో కార్యాలయం!



**సిరికొండ, ఏప్రిల్ 09 (మన వార్త)** నిజామాబాద్ రూరల్‌లోని సిరికొండ మండల కేంద్రంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. మండల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రబిందువైన ఈ కార్యాలయం ఇలాంటి దుస్థితిలో ఉండటంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కార్యాలయ ప్రహరీ గోడ కూలిపోవడం, భవనం లోపల గదులు పాడైపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సీలింగ్ నుండి సిమెంట్ ముక్కలు ఊడిపడుతుండటంతో అక్కడ పనిచేసే సిబ్బంది, కార్యాలయానికి వచ్చే ప్రజలు ఎప్పుడైనా ప్రమాదం సంభవిస్తుందేమోనన్న భయంతో వణికిపోతున్నారు. ప్రతిరోజూ వివిధ పనుల కోసం వందలాది మంది ప్రజలు ఈ కార్యాలయాన్ని సందర్శిస్తుంటారు. అయితే ఇలాంటి ప్రమాదకర వాతావరణంలో సేవలు పొందాల్సి రావడం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. పాలన సక్రమంగా కొనసాగాలంటే కార్యాలయ భవనం భద్రంగా ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఇక్కడ పరిస్థితి దానికి పూర్తి విరుద్ధంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, భవనాన్ని తక్షణమే మరమ్మతు చేయించాలి లేదా కొత్త భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం సంభవించే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి...

**–మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలి...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09** పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి



సారించాలని , మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం రోజు భువనగిరి పట్టణంలోని హనుమాన్ వాడలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో అందిస్తున్న మౌలిక వసతులు , బోధన విధానం , ఉపాధ్యాయుల హాజరు , తరగతి గదులను , డార్మెటరీ హాల్ తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడుతూ ప్రతిరోజు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందిస్తున్నారా.. లేదా..అని అడిగి తెలుసు కున్నారు. పాఠశాలలో ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. అలాగే భోజన శాలను పరిశీలించి , ఆహారం నాణ్యత , వంటశాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రధానంగా నాణ్యతను పరీక్షించి , వంట సామాగ్రి , సరుకులు , బియ్యం తదిత రాలను తనిఖీ చేసి , గడువు తేదీలను సరిచూసు కోవాలన్నారు. పాఠశాలలోని పరిసర ప్రాంతాలు పరిశీలిస్తూ పరిసరాలు , తాగునీరు , మరుగుదొడ్లు , మూత్రశాలలు ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే విద్యార్థులలో పాఠ్యాంశాలపై అవగాహన పెంచే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు. పట్టుదలతో కష్టపడి చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు: ఎల్లారెడ్డిపేట ఎస్సై రాహుల్ రెడ్డి



**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 09 :(మన వార్త ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టడం వల్ల ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డిపేట ఎస్సై కె. రాహుల్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు మండల రైతులకు ఆయన కీలక విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వరి కోతల సీజన్లో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టడానికి ప్రధాన రహదారులను వాడుతున్నారని, దీనివల్ల వాహనదారులు, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వారు ధాన్యం కుప్పలను గమనించలేక ప్రమాదాలకు గురవుతున్నారని ఎస్సై తెలిపారు. పంటను ఆరబెట్టుకోవడానికి రహదారులను ఉపయోగించడం వల్ల ఇతరుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా రోడ్డుపై ధాన్యం ఆరబోసిన కారణంగా ప్రమాదాలు సంభవిస్తే, అందుకు బాధ్యులైన యజమానులపై కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. రైతులందరూ పోలీసు వారికి సహకరించి, ధాన్యాన్ని కల్లాలు లేదా సురక్షిత ప్రాంతాల్లోనే ఆరబోసుకోవాలని కోరారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రైతులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

## క్రీడలకు స్థలం లేదు సిరికొండ యువతకు సరైన మైదానం ఎప్పుడొస్తుంది

**సిరికొండ, ఏప్రిల్ 09 (మన వార్త)** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలో యువతకు సరైన క్రీడా ప్రాంగణం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామంలో క్రీడలకు అనువైన మైదానం లేకపోవడంతో యువకులు రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లోనే ఆటలు ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కొద్ది ప్రదేశాలు కూడా సక్రమంగా అభివృద్ధి చేయకపోవడంతో క్రీడాకారులు సరైన సాధన చేయలేకపోతున్నారు. గ్రామంలో ఉన్న యువతలో ప్రతిభ ఉన్నప్పటికీ, మౌలిక వసతుల కొరత కారణంగా వారు ముందుకు రాలేకపోతున్నారని పెద్దలు చెబుతున్నారు. ప్రభుత్వం యువత అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ, సిరికొండలో మాత్రం క్రీడా ప్రాంగణం లేకపోవడం విచారకరమని స్థానికులు పేర్కొంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి, సరైన స్థలాన్ని గుర్తించి క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని యువకులు డిమాండ్ చేస్తున్నారు.

## గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ సాగర్ ను సన్మానించిన కొమరవెల్లి సుధాకర్



**గజ్వేల్ ఏప్రిల్ 09 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన కిరణ్ సాగర్ ను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపిన ఆర్యవైశ్య నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త కొమురవెల్లి సుధాకర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిబద్ధతగల న్యాయవాదిగా పేరున్న కిరణ్ సాగర్ నాయకత్వంలో స్థానిక న్యాయవాదుల సమస్యలు పరిష్కారం అవుతాయని బార్ అసోసియేషన్ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్నికైన కిరణ్ సాగర్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు

## విద్యా ప్రమాణాల పటిష్టతకు విద్యా కమిషన్ సిఫారసులను అమలు చేయాలి

**-బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఉమ్మడి నల్లగొండ జిల్లా సమన్వయకర్త ఎర్ర శివరాజ్...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09** తెలంగాణ రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పూర్తిగా అడుగంటి పోయాయని , ప్రభుత్వ పాఠశాలల విద్యా పటిష్టతకు వచ్చే విద్యా సంవత్సరం నుంచే తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసులను అమలు చేయాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా బాలల హక్కుల పరిరక్షణ వేదిక సమన్వయకర్త ఎర్ర శివరాజ్ కోరారు. గురువారం రోజు భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల/ పాఠశాల ఆవరణలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులతో , విద్యార్థులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా పాఠశాల విద్యా ప్రమాణాలు పూర్తిగా దెబ్బ తిన్నాయని ఆయన అన్నారు. పాలకుల నిర్లక్ష్యం , బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష కారణంగా ప్రాథమిక , ఉన్నత విద్యా ప్రమాణాలు దిగజారి పోయాయని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్రంలో పర్యటించి , ప్రభుత్వ / ప్రైవేటు పాఠశాలు సందర్శించి తయారు చేసిన సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. కొందరు అవగాహన రాహిత్యంతో కమీషన్ సిఫార్సుల పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు. తెలంగాణ విద్యా కమీషన్ సిఫార్సులను పూర్తిగా చదివి , అవగాహన చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు జంపాల అంజయ్య , ఆవుల వినోద్ కుమార్ , ఒగ్గు క్రిస్టోఫర్ , కొడారి వెంకటేష్ విద్యార్థులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇండ్ల ముగ్గురు లబ్ధి దారులకు ప్రొసీడింగ్ లేటర్ల పంపిణీ



**ఎల్లారెడ్డి పేట ఏప్రిల్ 09 : (మన వార్తా ప్రతినిధి)** ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్ పూర్ గ్రామంలో నూతనంగా ముగ్గురికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని వారికి ప్రొసీడింగ్ లేటర్లు గురువారం .గ్రామ సర్పంచ్ నాగేళ్ళీ వెంకటరెడ్డి చల్ల శంకర్ రెడ్డి , కొంపల్లి సరిత , నేరేళ్ల వజ్రవ్వ లకు అందజేశారు ఇట్టి కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సోనవేని రాజయ్య,వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ చెట్టిపల్లీ బాలయ్య,యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వుచ్చిడి పవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరిసిల్ల సురేష్,వంగళ మల్లారెడ్డి గ్రామ ఉపసర్పంచ్ కోర్రి అనిల్ కుమార్, వార్డ్ సభ్యులు మరోజు దేవేంద్ర,గట్ల మహిపాల్, పసులా పావని, భద్దుల శ్రావణి,నెరెల్ల లత కార్యదర్శి భూక్యా సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వంగ గిరిధర్ రెడ్డి



**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 09: (మన వార్తా ప్రతినిధి)** ఉత్తర్వులు జారీ చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచాక జిల్లా కమిటీలను నూతనంగా వేశారు.. అందులో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వంగ గిరిధర్ రెడ్డి కి ప్రధాన కార్యదర్శిగా కార్యవర్గంలోకి తీసుకున్నారు.. కాగా ఇంతకుముందు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఈసారి ప్రధాన కార్యదర్శిగా పదవి బాధ్యతను అప్పజెప్పారు. మొత్తం 45 మందితో కూడిన జాబితాను నిన్న సాయంత్రం రాష్ట్ర అధ్యక్షులు మహేష్ గౌడ్, విడుదల చేశారు. ఈ సందర్భంగా వంగ గిరిధర్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ నాయకులు, తన శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన...

**-పాల్గొన్న సర్పంచ్ బింగి అలివేలుమంగ శ్రీనివాస్...**

**-హాజరైన ఉప సర్పంచ్ జానా సత్యనారాయణ...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి గురువారం రోజు ఉదయం శంకుస్థాపన చేసిన సర్పంచ్ బింగి అలివేలుమంగ శ్రీనివాస్ , ఉప సర్పంచ్ జాన సత్యనారాయణ , పాలకవర్గ సభ్యులు. ఈ సందర్భంగా సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో 20 లక్షల సిసి రోడ్లు , నూతన మహిళా భవనం , ఆరోగ్య ఉప కేంద్రం మంజూరు చేసిన స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు భాష బోయిన బాల ప్రసాద్ , రామిడి కుమార్ రెడ్డి , దంతూరి రాణి శ్రీనివాస్ గౌడ్ , బింగి సంజయ్ కుమార్ , అంకర్ల శ్రీనివాస్ , బింగి లావణ్య రమేష్ , దొనకొండ శ్రీరాములు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పాలకూర శ్రీనివాస్ గౌడ్ , యాదాద్రి భువనగిరి జిల్లా అసెంబ్లీ అధ్యక్షులు బద్దం వాసుదేవ రెడ్డి , ఆర్ అండ్ బి ఏ ఈ , గ్రామ కార్యదర్శి నజీర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## మహనీయుల జయంతి ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ...

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09** తేదీ 9 గురువారం 2026 రోజున భువనగిరి పట్టణంలోని స్థానిక ప్రిన్స్ చౌరస్తా వద్ద మైనార్టీ జర్నలిస్టు ఫ్రంట్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ , మైనార్టీ ముఖ్యఅతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలో జరిగే మహ నీయుల జయంతి ఉత్సవాలను జయప్రదం చేయడానికి పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగిందని , ఈ యొక్క మహనీయుల జయంతి ఉత్సవాలలో ఎస్సీ , ఎస్టీ , బీసీ , మైనార్టీ వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొని మహ నీయుల జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఏప్రిల్ 14వ తేదీ నాడు డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ జయంతి రోజున భీమ్ ర్యాలీ నిర్వహించడం జరుగు తుందని , ఈ ర్యాలీలో ప్రజలు పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయ వలసిందిగా కోరారు. ఏప్రిల్ మాసం మహనీయుల జయంతి మాసం ఈ నెలలో మహనీయులు డాక్టర్ బాబు జగ్జీవన్ రాయ్ , మహాత్మా జ్యోతిరావు పూలే , డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ జన్మదినాన్ని పురస్కరించు కొని పట్టణంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని , ఈ కార్యక్రమాల్లో మహనీయుల సేవలు , వారు చేసిన పోరాటాల గురించి వచ్చే తరాలకు తెలియడమే కాకుండా వారి మార్గదర్శకం లో నేటి యువత నడవాలని ప్రజలను అవగాహన పరచడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జర్నలిస్ట్ ఫ్రెంట్ జిల్లా అధ్యక్షుడు ఎండి సుజా వుద్దీన్ , గౌరవాధ్యక్షుడు డాక్టర్ షేక్ హమీద్ పాషా , గౌరవ సలహాదారుడు ఇబ్రహీం బియబాని , కార్యదర్శి సమీ అక్తర్ , మైనార్టీ నాయకులు జావిద్ ఖాద్రి , మొహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కల్వకుర్తి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థిని ఎంపిక




**కల్వకుర్తి ఏప్రిల్ 9 మన వార్త ప్రతినిధి** కల్వకుర్తి ఇటీవల జరిగిన అండర్-20 (యు-20) రంగారెడ్డి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికల్లోహొటీజీటీడబ్ల్యూఆర్జేసీ సీఓఈ (బాలికల) కల్వకుర్తిహొవిద్యార్థినిహొఈ. సింధుహొఅద్భుత ప్రతిభ కనబరిచింది. ఆమెహొ400 మీటర్లు మరియు 800 మీటర్లహొపరుగు పందెంల్లోహొమొదటి స్థానాన్నిహొకైవసం చేసుకుని బంగారు పతకాలను సాధించింది. ఈ విజయంతో సింధు ఈ నెలహొ11 మరియు 12 తేదీల్లో హన్మకొండలోహొజరగనున్నహొరాష్ట్ర స్థాయిహొఅథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. తమ విద్యార్థిని రాష్ట్ర స్థాయికి ఎంపికవ్వడం పట్ల ప్రిన్సిపాల్హొశ్రీమతి స్వరూప, వైస్ ప్రిన్సిపాల్స్హొప్రీతి & విజయ, పీడీ & పీఈటీ నిర్మలహొమరియు అనితహొఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. సింధు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల బృందం మరియు సిబ్బంది ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎల్కతుర్తిలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు అరెస్ట్ 80 గ్రాముల గంజాయి స్వాధీనం



**ఎల్కతుర్తి, ఏప్రిల్ 9 మనవార్త ప్రతినిధి** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో గంజాయి సేవిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి ఫంక్షన్ హాల్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి గురువారం ఉదయం సుమారు 11:15 గంటల సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఫంక్షన్ హాల్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో అనుమానాస్పదంగా కూర్చున్న ఇద్దరు వ్యక్తులను గమనించారు. వారి వద్ద నుంచి పొగ వస్తుండటంతో వెంటనే తనిఖీ చేయగా, వారు గంజాయి సేవిస్తున్నట్టు గుర్తించారు. అరెస్ట్ అయిన వారిని కరీంనగర్ జిల్లా రేకుర్తి గ్రామానికి చెందిన దుర్గం కృష్ణకుమార్, సిద్దిపేట జిల్లా లక్ష్మింపురం గ్రామానికి చెందిన భోనగిరి సాయికిరణ్గా గుర్తించారు. వారి వద్ద నుంచి సుమారు 80 గ్రాముల గంజాయి (అంచనా విలువ రూ. 4,000)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రెండు మొబైల్ ఫోన్లను కూడా జప్తు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్కు తరలించినట్లు సీఐ పులి రమేష్ తెలిపారు.

## వృద్ధులకు వైద్య సేవలు అందిస్తాం...

**-డిప్యూటీ డిఎంహెచ్ఓ భీమా నాయక్...**

**కల్వకుర్తి. ఏప్రిల్ 9. మన వార్త ప్రతినిధి.** కల్వకుర్తి వృద్ధాశ్రమంలోవృద్ధులకు వైద్య పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు. వృద్ధులకు ఎల్లవేళలా వైద్య సేవలు అందిస్తామని డిప్యూటీ డీఎంహెచ్ ఓ భీమా నాయక్ అన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా కల్వకుర్తి పట్టణంలోని వృద్ధాశ్రమంలో గురువారం జి జి హెచ్, రఘుపతి పేట పి. హెచ్.సి సబ్ సెంటర్ వైద్యులు , సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు రక్త పరీక్షలు, బిపి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం వృద్ధాశ్రమ నిర్వాహకులు పెరుమాళ్ళ వెంకటయ్య అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ భీమా నాయక్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో వృద్ధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఏప్పుడు ఏ అవసరం ఉన్న సేవలందించేందుకు వైద్యులు,సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రఘుపతిపేట పిహెచ్ సి డాక్టర్ అత్త ఉల్లా ఖాన్, ఎంఎల్ హెచ్ పి డాక్టర్ వర్షిత్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ ప్రమోద్, బి ఎస్ కే ప్యాలెట్ సేవా కేంద్రం నర్సింగ్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఫిజియోథెరపిస్ట్ లలిత, వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ పద్మ, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, వృద్ధులు,తదితరులు పాల్గొన్నారు.



## స్వర్ణగిరిషుడికి ఘనంగా తిరుప్పావడ సేవ...

**-ఆహా ఏమి ఈ భాగ్యము శ్రీనివాసుడి కళ్యాణ మహోత్సవము...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09** కలియుగ ప్రత్యక్ష దైవమైన యాదాద్రి తిరుమల తిరుపతి దేవస్థానం స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం కోసం స్వామి వారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారు. ప్రతి గురువారం రోజు నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది. అప్పుడు సుమారు 450 కిలోల అన్న ప్రసాదాన్ని , లడ్డు , వడ తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు. వేదమంత్రోచ్ఛారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు. ఉదయం 10:30 లకు విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్ప మాలలతో అలంకరించి స్వామి వారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రవణాచార్యులు దివ్య కరములచే అంగరంగ వైభవంగా నిర్వహించగా భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి నిత్య అన్న ప్రసాద వితరణలో భాగంగా నేడు సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 లకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడ వీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీవారికి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగు తున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శించుకున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు , ఆలయ చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు తెలిపారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకట్ రెడ్డి, శ్రీనివాస మూర్తి




**కల్వకుర్తి ఏప్రిల్ 9 మన వార్తా ప్రతినిధి** తలకొండ పల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన తప్పేట ప్రేమ లత కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారం తో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ను బాధిత కుటుంబానికి అందజేసిన ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకట్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ పెద్ద వరం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కి సహకారం అందిస్తుంది అన్నారు. కుల మతాలకు అతీతంగా అందరినీ ఆదుకునే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి టీసీ శ్రీనివాస మూర్తి. అంబాజీ. మాజీ ఉప సర్పంచ్ బోయ్ నర్సింహ. అజీజ్ . కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్నం వెంకట్ రెడ్డి. రవిందర్ గౌడ్. లింగం యాదవ్. శ్రీకాంత్ రెడ్డి. శివ. తదితరులు పాల్గొన్నారు

# పథకాలపై ప్రతిపక్షాల దుష్ప్రచారం...

**– చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి...**



**శంకరపట్నం:ఏప్రిల్09(మనవార్త ప్రతినిధి)** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారాలు కొనసాగిస్తున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.గురువారం శంకరపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికలో సీఎంఆర్ఎఫ్,కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ,,ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని అయితే ఈ పథకాలపై ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు బెంబేలెత్తిపోయి దుష్ప్రచారాలకు ఒడిగట్టాయని ఆయన విమర్శించారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డులు,డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చిన పాపాన పోలేదని ఆయన ఆరోపించారు.ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకం దారులకు ఉచిత విద్యుత్తు,కొత్త రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు,సన్న బియ్యం,సన్నవడ్లకు రూ. 500 బోనస్,రైతు భరోసా పథకాల ప్రభుత్వం అమలు చేస్తుండడంతో ప్రతిపక్షాలకు మింగుడు పడక దుష్ప్రచారం కొనసాగిస్తున్నాయని,వీటిని ప్రజలు కాంగ్రెస్ శ్రేణులు తిప్పి పట్టాలని ఎమ్మెల్యే కోరారు.రహస్య ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నప్పటికీ ఆదాయ మార్గాలను అన్వేషించుకుంటూ సంక్షేమ పథకాలను అమలు చేసి తీరుతామని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు.సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఇప్పటివరకు 24 విడతల్లో చెక్కులు పంపిణీ చేశామని, 24వ విడతలో 102 మంది లబ్ధిదారులకు 28 లక్షల 21 వేలు మంజూరు కాగా,వాటిని చెక్కుల రూపంలో పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే వివరించారు.అలాగే 91 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులు అందించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో శంకరపట్నం తహాసిల్దార్ కే. సురేఖ,ఎంపీడీవో కృష్ణ ప్రసాద్,మాజీ జడ్పిటిసి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్,శంకరపట్నం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగాని బస్వయ్య గౌడ్, ఏఎంసి వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి,కొత్తగట్టు టెంపుల్ చైర్మన్ కోరెం రాజిరెడ్డి,పార్టీ నాయకులు ఉప్పుగళ్ల మల్లారెడ్డి,బండారు తిరుపతి,కవ్వ పద్మ, చింతిరెడ్డి పద్మ,దుర్గం తిరుపతి,గొట్టె మధు ఊకంటి మధుకర్,ఉప్పుగళ్ల మల్లారెడ్డి,ఎగ్గని రమేష్,తాటికొండ సదానందం,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెపు అజయ్, రాయిని రమేష్,గాజుల మహేష్, షారుక్,ఇషాముద్దీన్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.అంగన్వాడీ భవనం ప్రారంభం శంకరపట్నం మండలం గుడాడిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడి కేంద్రం భవనాన్ని గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు.

# ప్రజా పాలన ప్రభుత్వంలోనే ప్రజలకు న్యాయం



**కల్లూరు ఏప్రిల్ 9 ( మన వార్త)**మండల పరిధి పుల్లయ్య బంజరు, విశ్వ బ్రాహ్మణ కాలనీ, చెన్నూరు పెద్ద కోరుకొండి గ్రామాలలో గురువారం సత్తుపల్లి మహిళా శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సహాయ సకారంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసి మహిళా చైర్మన్ భాగం నీరజ మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ లు ప్రారంభించారు అనంతరం కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు రైతు బంధు సన్నాలకు బోనస్, ప్రతి ఒక్క కౌలు రైతుకు ప్రోత్సాహం అందించిన ఏకైక ప్రభుత్వం ప్రజాపాలన ప్రభుత్వం అని రైతుల శ్రేయస్సు లక్ష్యశీగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలలో రైతే రాజుగా లక్ష్యసాధనలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వ్యవసాయానికి 24 గంటలు ఉచితంగా రైతులకు విద్యుత్ భూమి పన్ను లేకుండా, రైతు పొలానికి పెట్టుబడి కింద ఉచితంగా రైతు భరోసా, పండించిన ధాన్యానికి బోనస్ రూపంలో క్వింటాకు రూ,500 రూపాయలను అందించి రైతుల కష్టానికి ప్రతిఫలంగా రైతే రాజుగా తీర్చిదిద్దిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు అనంతరం ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ కల్లూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలోని అన్ని సొసైటీలకు సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ యొక్క ఆలోచనల మేరకు రైతులకు అందుబాటులో గన్ని బ్యాగులు ట్రాన్స్పోర్ట్ సౌకర్యము వర్షాలు ఏర్పడితే గింజ తడవకుండా పట్టాలను ముందస్తుగానే స్టాక్ పెట్టి రైతులకు సొసైటీల ద్వారా అందించిన ఏకైక ఎమ్మెల్యే మన సత్తుపల్లి శాసనసభ్యురాలు అని నిరంతరం ప్రజల శ్రేయస్సు తన శ్రేయస్సుగా భావించిన ఏకైక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాఘమై దయానంద్ అని అన్నారు. అంతేకాకుండా చివరి వరకు ప్రతి ధాన్యం గింజలు కొనుగోలు చేస్తామని వారు తెలిపారు అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్యవైశ్య ఖమ్మం జిల్లా అధ్యక్షులు పసుమర్తి చంద్రావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం రేవంత్ రెడ్డి పాలనలో ప్రతి రైతుకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగిందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కల్లూరు తాసిల్దార్ బ్రహ్మేశ్వర రావు,కల్లూరు టు మహిళా ఆర్ ఐ సుజాత , కౌన్సిలర్లు బీరవల్లి మాధవ్ , జిల్లెల్ల స్వాతి భాస్కర్ రెడ్డి, కిష్టంశెట్టి లక్ష్మీ కొండల్ , చెన్నూరు గ్రామపంచాయతీ సర్పంచ్ జినుగు శ్రీనివాసరావు ,మాజీ సర్పంచ్ చిరసాని జమలయ్య,ఉప సర్పంచ్ నలజాల కిషోర్ ,మంగపతి పసుమర్తి మోహన్రావు, రావూరి వెంకటేశ్వరరావు, శ్రీరామ్ యాదవ్, డిసిసిబి సూపర్వైజర్ ప్రవీణ్ ,సొసైటి సీఈవో మేరుగు వెంకటేశ్వర్లు, ఏ ఈ ఓ వెంకటలీల,మాధల వెంకటేశ్వరరావు శీలం రామిరెడ్డి, పోట్రు ప్రసాద్ చౌదరి, సంగెపు శివ , బీరవల్లి రాము ,గంతోటి వెంకటేశ్వర్లు , కోట శ్రీను, కోమటి రాంబాబు, దేవవరపు సత్యనారాయణ, దేవభక్తిని కృష్ణకుమారి, మల్లికార్జున రావు, వేము నాగమణి , గొర్రెపాటి వేణు దేవకర్ణ ,ఇరుకు వెంకటి లైట్ల శ్రీనివాస్ ,బి బేబీ, బి శ్రీదేవి, డి రాజేశ్వరి, వివిధ గ్రామాల నుండి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన డి ఈ యాదగిరి...



**చిన్న శంకరంపేట ఏప్రిల్ 9( మన వార్త ప్రతినిధి)** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలబ్ధిదారులు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి గృహప్రవేశాలు చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ డి ఈ యాదగిరి తెలిపారు, చిన్న శంకరం పేట మండలం టీ మాందాపూర్ తాండ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను గృహ నిర్మాణ శాఖ డి యాదగిరి లోకేష్ స్థానిక సర్పంచ్ అశోక్ నాయక్ తో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదోడి సొంతింటి కల నెరవేర్చే విధంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశ పెట్టడం జరిగిందని లబ్ధిదారులు త్వరగా పనులు పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు త్వరగా చేపట్టాలని వారు సూచించారు, ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డిఈ యాదగిరి, ఏఈ లోకేష్, సర్పంచ్ అశోక్ నాయక్, పంచాయతీ కార్యదర్శి గణేష్, ఉప సర్పంచ్ లాలూ నాయక్, వార్డు సభ్యులు మోహన్ నాయక్, శేఖర్ నాయక్, అమృనాయక్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు

# ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయాలి..

**జమ్మికుంట, ఏప్రిల్ 09( మన వార్త ప్రతినిధి):**పట్టణంలో ప్రతి సంవత్సరం నిర్వహించే డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఈసారి ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ జన సమితి (టి.జె.ఎస్) పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అరికిల్ల భానుచందర్, పార్టీ మహిళా విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికిల్ల స్రవంతి లు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆయన జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అంబేద్కర్ జయంతి వేడుకలు సరైన ఉత్సవ కమిటీ లేకుండా తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అపారమని, అలాంటి మహనీయుని జయంతి వేడుకలను గౌరవప్రదంగా, ఘనంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు.ఈ సంవత్సరం అంబేద్కర్ జయంతి వేడుకలకు ప్రత్యేక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ ఆధ్వర్యంలో సమగ్రంగా కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఈనెల 13 నుంచి అరైవ్- అలైవ్ వారోత్సవాలు...

**–వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎస్ రామకృష్ణా రావు డిజిపి శివధర్ రెడ్డి...**



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09** 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వచ్చే సోమవారం నుంచి అరైవ్ – అలైవ్ వారోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్–అలైవ్ వారోత్సవాల కార్యక్రమం నిర్వహణపై రాష్ట్ర సీఎస్ రామకృష్ణారావు , రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు , ఎస్పీలు , డీసీపీలతో గురువారం రోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు. సిఎస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రజలెందరో ప్రాణాలు కోల్పోతున్నారని , అరైవ్ – అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ట్రాఫిక్ నియమాలు , రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలను తగ్గించ వలసిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ మేరకు డిజిపి మాట్లాడుతూ అధికారులు అరైవ్ – అలైవ్ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించి , రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ రోడ్డు భద్రత కార్యక్రమాలను జిల్లాలో విజయవంతం చేయాలని అన్నారు. ఈ14న అంబేద్కర్ జయంతి సందర్భంగా రోడ్ భద్రత ప్రతిజ్ఞ , ఇతర కార్యక్రమాలు నిర్వ హించాలన్నారు. పోలీస్ శాఖ తరపున అర్రైవ్–అలైవ్ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించడం , కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్టును పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తే రహదారి ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దామోదర్ రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణకు హాజరైన వొడితల ప్రణవ్



**జమ్మికుంట, ఏప్రిల్ 09( మన వార్త ప్రతినిధి):**రాజకీయాల్లో ప్రజల అవసరాల కోసం పనిచేసి కరీంనగర్ జిల్లా టైగర్ గా,నమ్మకానికి,విశ్వసనీయతకు మారు పేరు తెచ్చుకున్న మహా నాయకుడు ముద్దసాని దామోదర్ రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున కరీంనగర్ పట్టణ శివారులోని సదాశివపల్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ విజయ రమణారావు ఆధ్వర్యంలో దామోదర్ రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ముద్దసాని దామోదర్ రెడ్డి గురించి జిల్లాలో తెలియని వ్యక్తి లేడంటే అతిశయోక్తి కాదని,వ్యక్తిగతంగా మా కుటుంబానికి,మా తాత వొడితల రాజేశ్వర్ రావు కు చాలా దగ్గరి వ్యక్తి అని,వారి నుండి మాలాంటి యువతర నాయకులం నేర్చుకోవాల్సింది చాలా ఉందని,వారి ఆశయాలకు అణుగుణంగా ప్రజా జీవితంలో పనిచేస్తామని,హుజూరాబాద్ నియోజకవర్గంలో దామోదర్ రెడ్డి విగ్రహన్నీ ఏర్పాటు చేస్తామని ప్రణవ్ తెలిపారు.విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సభలో పెద్దపల్లి శాసన సభ్యుడు విజయ రమణారావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే కాదు రాష్ట్ర స్థాయిలో దామోదర్ రెడ్డికి అభిమానులు ఉండేవారని,వారి తర్వాత ఆ ప్రాంతానికి నాయకత్వం వహించే నాయకుడిగా వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ,కరీంనగర్ శాసన సభ్యులు గంగుల కమలాకర్,కరీంనగర్ మేయర్ శ్రీనివాస్,సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు మల్లేష్,దామోదర్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ ను ఏర్పాటు ను రద్దు చేయాలి..

**– ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసిన సబ్బాని...**



**జమ్మికుంట,మార్చి 09 ( మన వార్త ప్రతినిధి):**హుజురాబాద్ లో ఏర్పాటు చేసే డంపింగ్ యార్డ్ ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని ప్రత్యేకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేసి సీఎం దృష్టికి తీసుకెళ్లాలని సబ్బాని వెంకట్ కోరారు. ఈ సందర్భంగా సబ్బాని వెంకట్ మాట్లాడుతూ హుజురాబాద్ అనేది విద్య, వైద్యం, ఉపాధి రంగాలలో దశాబ్దాలుగా వెనుకబడిన ప్రాంతం. గత 40 సంవత్సరాలుగా ఇక్కడ వ్యవసాయం,మౌళిక సదుపాయాల మీద పెట్టిన దృష్టి ,అభివృద్ధి మీద పెట్టలేదు. ఈ ప్రాంతానికి గౌరవంగా చెప్పుకునే ఒక మంచి కాలేజీ, ఒక పెద్ద కంపెనీ, లేదా ఉపాధి కల్పించే ఫ్యాక్టరీ కూడా తీసుకురావడానికి నాయకులు నిజమైన కృషి చేయలేదన్నారు. ఫలితంగా, హుజురాబాద్ యువతకు అవకాశాలు లేక, అభివృద్ధి మార్గాలు మూసుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇక్కడి పిల్లలు ఎంతో కష్టపడి ఉన్నత విద్యలు పూర్తి చేసినా, సరైన ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగులుగా మారుతున్నారు. సమాజంలో అవమానాలు ఎదుర్కొంటూ, దొరికిన చిన్నపాటి పనులు చేస్తూ లేదా ఇంటికే పరిమితమైపోతున్నారు. చాలామంది తమ కుటుంబ వారసత్వంగా వచ్చిన వ్యవసాయం లేదా చిన్నచిన్న వ్యాపారాల మీద ఆధారపడి కాలం గడుపుతున్నారు. ఇది ఒక ప్రాంత అభివృద్ధి లోపానికి స్పష్టమైన ఉదాహరణ అని చెప్పారు.అలాంటి పరిస్థితుల్లో ఉన్న ఈ చిన్న చిన్న బ్రతుకులను కూడా ఇప్పుడు డంపింగ్ యార్డ్ మరియు వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ వల్ల నాశనం చేసే పరిస్థితి తీసుకురావడం చాలా బాధాకరం. రాజకీయాలను వ్యాపారంగా మలుచుకున్న వారు ఈ విషయాన్ని పట్టించుకోకపోవచ్చు, కానీ నాకు నా ఊరు హుజురాబాద్ నియోజకవర్గం అత్యంత ముఖ్యమైనది అని అన్నారు.ఇన్నాళ్లుగా నేను ఈ ప్రాంత సమస్యలను గుర్తించి, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ, ప్రజల ప్రతినిధులుగా చెప్పుకునే నాయకులను ప్రశ్నిస్తూ వచ్చాను. "నా ఉద్దేశం ఒకటే ఒక రోజు నాయకులు ఈ సమస్యలను పరిష్కరిస్తారు, లేకపోతే ప్రజలు వారిని ప్రశ్నించే స్థాయికి చేరుకుంటారు. కానీ, నేను ఆశించిన స్థాయిలో నా ఆలోచన సఫలీకృతం కాలేదు." ఇప్పుడు డంపింగ్ యార్డ్ వంటి ప్రాజెక్ట్ వల్ల మన గ్రామాల మనుగడ ప్రశ్నార్థకంగా చేరే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై ప్రజల్లో పూర్తి అవగాహన, భావోద్వేగం పెరిగినప్పటికీ, రాజకీయ నాయకులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా బాధ కలిగిస్తోంది. ఇంత తీవ్రమైన సమస్యను కూడా తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం, తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నించడం చూస్తే ఇక మౌనం వహించడం సరికాదు అనిపిస్తుందని అన్నారు. హుజురాబాద్ ప్రాంత ప్రజల నుండి వస్తున్న వ్యతిరేకతను గమనించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపి ఈ యొక్క డంపింగ్ యార్డ్ ను ఎలాంటి నివాసాలు వ్యవసాయ పొలాలు ప్రజలకు దూరంగా ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# లెవల్ క్రాసింగ్ లైన్ ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ ల ఏర్పాటు..



**జమ్మికుంట, ఏప్రిల్ 09( మన వార్త ప్రతినిధి);**లెవల్ క్రాసింగ్ లైన్ ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ ల ఏర్పాటు కోసం అధికారులు పరిశీలించారు.దక్షిణ మధ్య రైల్వే సంస్థ రైల్వే లైన్ విస్తరణ మరియు అభివృద్ధి లో భాగంగా లెవల్ క్రాసింగ్ లైన్ ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ లను ఏర్పాటు చేయుటకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా LC.20 లెవెల్ క్రాసింగ్ జమ్మికుంట,మడిపల్లి క్రాస్ రోడ్డు మరియు LC.25 లెవెల్ క్రాసింగ్ బిజిగిర్ షరీఫ్,పాపయ్యపల్లి గ్రామ క్రాస్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ ల కొరకు గురువారం అధికారులు పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నల్ల వెంకట్ రెడ్డి, గిర్ధవార్లు సత్యనారాయణ, శంకర్ గ్రామాల సర్పంచ్ లు మ్యకమల్ల తిరుమల వెంకటేష్, అమరగొండ నిర్మలా బాబు రావు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, రోడ్ సెక్టార్ రైల్వే భూ సేకరణ నిపుణులు పి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు అందచేసిన చేవెళ్ల శాసనసభ్యులు



**మొయినాబాద్ ఏప్రిల్ 09:మన వార్త ప్రతినిధి** మొయినాబాద్ మండల కేంద్రంలోని ఎం.పీ.డీ.వో కార్యాలయంలో మండలానికి,మున్సిపాలిటీ కీ చెందిన కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య మరియు రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి లబ్ధిదారులకు అందచేశారు. శాసనసభ్యులు యాదయ్య మాట్లాడుతు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో అనేకమైన ప్రభుత్వ పథకాలతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి కల్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్, అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా ప్రజా ప్రభుత్వం చూస్తుంది అన్నారు. ముఖ్య మంత్రి సారథ్యంలో ఇకముందు అనేక ప్రభుత్వాపథకాలు ప్రవేశపెట్టి అందేలా చూస్తామని శాసనసభ సభ్యులు యాదయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ షాబాద్ సోనియా దర్శన్, మరియు కౌన్సిలర్స్, వివిధ గ్రామాల సర్పంచులు, మొయినాబాద్ తాసిల్దార్ గౌతమ్ కుమార్ , మొయినాబాద్ మున్సిపాలిటీ కమీషనర్,మొహమ్మద్ జాకీర్ హమీద్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ మందడి చంద్రారెడ్డి, శ్రీరామ్ నగర్ మాజీ ఎంపీటీసీ రామ్ రెడ్డి, మత్స్యకార చైర్మన్ నారాయణపురం మహేందర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణ గౌడ్,గడ్డం వెంకటరెడ్డి, అశోక్ యాదవ్ బకారం వార్డ్ సభ్యులు బందీ అనిల్ కుమార్ ఏఎంసి డైరెక్టర్స్ సత్యనారాయణ,పార్టీ శ్రీనివాస్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## చలివేంద్రం ను ప్రారంభించిన తూప్రాన్ ఆర్డిఓ జయచంద్రారెడ్డి...



**చేగుంట ఏప్రిల్ 9( మన వార్త ప్రతినిధి)** చేగుంట మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో తహసిల్దార్ శివప్రసాద్ ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని తూప్రాన్ ఆర్డిఓ జయచంద్రారెడ్డి ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేగుంట మండల ప్రజలు వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు రావడం జరుగుతుందని వేసవికాలం దృష్టిలో పెట్టుకొని వారి దాహార్తిని తీర్చేందుకు తహశీల్దార్ శివప్రసాద్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమని తెలిపారు, ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డిఓ జయచంద్ర రెడ్డి తో పాటు తహశీల్దార్ శివప్రసాద్ రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న సర్పంచ్...



**చిన్న శంకరంపేట ఏప్రిల్ 9( మన వార్త ప్రతినిధి)** గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలిపిస్తే మజీద్ కు స్లాబ్ తన సొంత డబ్బులు వెచ్చించి వేపిస్తానని హామీ ఇచ్చిన చంద్రశేఖర్. గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా విజయం సాధించడంతో మైనార్టీలకు ఇచ్చిన హామీ ప్రకారం నేడు మజీద్ స్లాబ్ వేయించి తన మాట నిలబెట్టుకున్నారు, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం స్లాబ్ వేయించిన సర్పంచ్ చంద్రశేఖర్ ను మైనార్టీ సోదరులు శాలువాలతో ఘనంగా సన్మానించి మీఠాయిలు తినిపించారు.

## మా సమస్యలు వెంటనే పరిష్కరించాలి...




**-తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ సమ్మె...**

**హుజురాబాద్,ఏప్రిల్ 9(మనవార్త )**హుజురాబాద్ తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ పిలుపు ను మేరకు అన్ని డివిజన్ ల ముందు సమ్మె ఏర్పాటు నిర్వహించారు . అందులో భాగంగా రెండో రోజు హుజురాబాద్ డివిజన్ ఆఫీస్ ముందు సమ్మె కార్యక్రమం లో ఆర్టిజెన్, అనుమ్యాన్ కార్మికులు, ఎస్ పి ఎం వర్కర్స్, పిసురేటు వర్కర్స్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిమాండ్స్ ఓకె సంస్థ లో ఓకే రులు ఉండలని ముఖ్యం గాఆర్టిసన్ కార్మికులకు ఏ పి ఎస్ ఈ బి రూల్స్ వర్తింపచేయాలి,అనుమ్యాన్ కార్మికులను ఆర్టిసన్ గా గుర్తించాలి,పిసురేటు కార్మికులకు జీ.ఓ.11 ప్రకారం కనీస వేతనం ఇవ్వాలి,విధుల్లో చనిపోయిన కార్మికుని కుటుంబం లో ఒకరికి ఉద్యోగం కల్పించాలి అన్నారు. ఆర్టిసన్ కార్మికులు పంజలా శ్రీనివాస్, ఉప్పల్ రవి, అనుమ్యాన్ కార్మికులు వెంకటేష్, శివ, రవి శ్రవణ్, రాజు, శ్రీను, రాజు, పాల్గొని వారు మాట్లాడుతూ ఈ సంస్థ లో సుమారు గత 15-20 సంవత్సరాల నుండి పనిచేయుచున్నాము. మాలో కొంత మంది విద్యుత్ షాక్ కు గురై చనిపోవడం జారిగింది. ఉద్యోగం భద్రత లేదు. కావునా యాజమాన్యం మరియు ప్రభుత్వం వెంటనే మా న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని కోరారు. ఈ సమ్మె కార్యక్రమంలో హుజురాబాద్ డివిజన్ పరిధి లో ఉన్న అందరూ ఆర్టిసన్ కార్మికులు, అన్ని సెక్షన్ లలో ఉన్న అందరూ అనుమ్యాన్ కార్మికులు, ఎస్ పి ఎం కార్మికులు, పిసురేటు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ బస్టాండ్ లో దుర్వాసన..





**కరీంనగర్,ఏప్రిల్ 09( మన వార్త ప్రతినిధి):**జిల్లా కేంద్రమైన నిత్యం రద్దీగా వుండే కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో మరుగు దొడ్ల నీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర అస్వస్థతలు పడుతున్నారు.ముక్కు పుటాలు అదిరేలా దుర్వాసన వెదజల్లుతుంది.మరుగు దొడ్ల నుండి మల మూత్రాలు బస్సు ఫ్లాట్ ఫారం మీద నుండి ఆవరణలో ప్రవహిస్తుంది.బస్సు ఎక్కడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు



పడుతున్నారు.ఆదాయం వున్నా నిర్వహణ లోపం ఉందని ప్రయాణికులు మండిపడుతున్నారు.అనారోగ్య సమస్యలు దారితీస్తాయని భయాందోళనకు గురవుతున్నారు.పారిశుధ్య లోపంతో మహిళలు,పిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. షాపుల ద్వారా నెలకు లక్షలకు పైగా ఆదాయం వస్తున్నా బస్టాండ్ నిర్వహణ అధ్వాన్నంగా ఉందని ప్రయాణికులు మండిపడుతున్నారు.ఆర్టీసీ అధికారులు స్పందించి మరుగు దొడ్ల నీరు బస్టాండ్ లో ప్రవహించకుండా మరమత్తులు చేయించాలని,బస్టాండ్ పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# సైయెంట్ కినెటెక్ కొనుగోలు...




**న్యూఢిల్లీ,** చిప్‌ల తయారీ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సైయెంట్ అనుబంధ సంస్థ సైయెంట్ సెమికండక్టర్ కీలక అడుగు వేసింది. అమెరికాకు చెందిన పవర్ సెమికండక్టర్ సొల్యూషన్ సంస్థ కినెటిక్ టెక్నాలజీలో మెజార్టీ వాటాను కొనుగోలు చేసింది. ఈ ఒప్పందం ద్వారా సుమారు 74 శాతం వాటాను రూ.785 కోట్లకు హస్తగతం చేసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది.చిప్‌ల యారీలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం లక్ష్యంగా ఈ భాగస్వామ్యాన్ని ఏర్పరచుకున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. అమెరికా సంస్థతో కలిసి పనిచేయడం ద్వారా సెమికండక్టర్ రంగంలో తన స్థాయిని మరింత బలోపేతం చేసుకోవాలని సైయెంట్ భావిస్తోంది. ఈ కొనుగోలు ద్వారా గ్లోబల్ మార్కెట్లో పోటీ సామర్థ్యం పెరిగే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు.సైయెంట్ సెమికండక్టర్ ప్రధాన అధికారి సుమన్ నారాయణ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో చిప్‌ల తయారీ రంగంలో పెద్ద అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకునేందుకు ఈ ఒప్పందం కీలకమని తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పత్తి సామర్థ్యం రెండింటినీ విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

## కేంద్రం ఇంటిపై సోలార్ ప్యానెల్స్‌కి రూ.78,000 సబ్సిడీ



**న్యూఢిల్లీ,** ప్రతి నెలా పెరుగుతున్న విద్యుత్ బిల్లులు సామాన్య కుటుంబాల బడ్జెట్‌ను భారంగా మార్చుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం “పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన“ను ప్రారంభించింది. ఈ పథకం కింద ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తే, విద్యుత్ బిల్లులు దాదాపు సున్నా అవుతాయి. ప్రభుత్వం గరిష్టంగా రూ.78,000 వరకు సబ్సిడీ అందిస్తోంది. 1 కిలోవాట్ సిస్టమ్‌కు రూ.30,000, 2 కిలోవాట్‌కు రూ.60,000, 3 కిలోవాట్ లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి రూ.78,000 నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. దీని ద్వారా సాధారణ ప్రజలు భారీ పెట్టుబడి లేకుండా సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవచ్చునని ప్రభుత్వం పేర్కొంది.మిగిలిన ఖర్చుల కోసం బ్యాంకులు తక్కువ వడ్డీ రేట్లతో రుణాలను అందిస్తున్నాయి. రుణ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఆధార్, విద్యుత్ బిల్లు, మొబైల్ నంబర్ వంటి ప్రాథమిక పత్రాలతో 15□20 నిమిషాల్లో దరఖాస్తు పూర్తి చేయవచ్చు. ఒకటి లేదా రెండు రోజుల లోపు రుణం మంజూరు అవుతుంది. ఈ పథకం కింద 10 సంవత్సరాల తిరిగి చెల్లింపు గడువు, ప్రారంభంలో 6 నెలల మారటోరియం సౌకర్యం కూడా ఉంది. అదనంగా ‘నెట్ మీటరింగ్’ ద్వారా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చు.సోల్ విద్యుత్ వైపు మారడం వల్ల ఖర్చులు తగ్గడమే కాకుండా దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కూడా లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం సామాన్యులకు విద్యుత్ స్వావలంబన సాధించడానికి ఒక కీలక అవకాశం అని ప్రత్యేకంగా సూచిస్తోంది.

## ఇంకా అవార్డుల్లో తెలుగు సినీ రంగం మెరుపు




**ముంబై,** భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డులు 2026 విజేతలను ప్రకటించారు. దేశవ్యాప్తంగా వివిధ భాషల చిత్ర పరిశ్రమలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ అవార్డులు ఈసారి కూడా విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగు విభాగంలో యువ నటుడు నాగచైతన్య 'తండేల్' చిత్రంలో తన నటనకు గాను ఉత్తమ నటుడిగా ఎంపిక కాగా, నటి రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రంతో ఉత్తమ నటిగా అవార్డు అందుకోనుంది. ఇప్పటికే తెలంగాణలో జరిగిన గద్దర్ అవార్డుల్లో కూడా ఈ ఇద్దరూ ఉత్తమ నటీనటులుగా గుర్తింపు పొందడం విశేషం. ఇప్పుడు అదే విభాగంలో మరోసారి జాతీయ స్థాయిలో అవార్డులు దక్కించుకోవడం తెలుగు సినీ రంగానికి గర్వకారణంగా మారింది. ఈ అవార్డులు వారి నటనా ప్రతిభకు మరో ముద్రవేసినట్లయ్యింది. ఉత్తమ తొలి దర్శకుడిగా రామ్ జగదీష్ 'కోర్ట్' చిత్రానికి గాను ఎంపికయ్యారు. ఇతర భాషల్లో కూడా పలువురు ప్రముఖులు అవార్డులు గెలుచుకున్నారు. తమిళంలో దుల్కర్ సల్మాన్ ఉత్తమ నటుడిగా, సిమ్రాన్ ఉత్తమ నటిగా ఎంపిక కాగా, కన్నడలో రిషబ్ శెట్టి 'కాంతార అధ్యాయం ఒకటి' చిత్రంతో ఉత్తమ నటుడు, దర్శకుడు అవార్డులు అందుకున్నాడు. అదే చిత్రం ఉత్తమ చిత్రంగా కూడా నిలిచింది. మలయాళంలో నివిన్ పౌలీ ఉత్తమ నటుడిగా నిలిచాడు. హిందీలో రణవీర్ సింగ్ ఉత్తమ నటుడిగా, యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఏప్రిల్ 16న ముంబైలో ఘనంగా జరగనుంది. ఈ వేడుకకు నటుడు రానా దగ్గుబాటి, దర్శకుడు కరణ్ జోహార్ హోస్టులుగా వ్యవహరించనున్నారు. సీనియర్ నటి రేఖ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు అనేక మంది సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మొత్తంగా చూస్తే, ఇంకా అవార్డులు 2026లో తెలుగు సినీ పరిశ్రమ మరోసారి తన ప్రతిభను దేశవ్యాప్తంగా చాటుకుంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది.

## సుప్రియకు సమంత ప్రశంసలు



**హైదరాబాద్,** ప్రముఖ నటి సమంత తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. నిర్మాత సుప్రియ నిర్మిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, ఆమెకు సమంత ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. సమంత తన సందేశంలో సుప్రియ కష్టాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, "డెకాయిట్ సినిమా కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. ఈ విజయానికి నీకంటే ఎవరూ అర్హులు కారు" అంటూ ప్రశంసలు కురిపించారు. అలాగే ఈ చిత్రం ఘన విజయాన్ని సాధించాలని కోరుతూ ఆమెకు ఆశీస్సులు తెలిపారు. ప్రస్తుతం సమంత కథానాయికగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా రాణిస్తూ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. మరోవైపు 'డెకాయిట్' చిత్రంలో నటిస్తున్న అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు కూడా జోరుగా కొనసాగుతున్నాయి. ఈ సినిమాకు ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రతినాయక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. విడుదల తేదీ సమీపిస్తున్న కొద్దీ చిత్రంపై హైప్ మరింత పెరుగుతోంది. మొత్తంగా చూస్తే, సమంత చేసిన ఈ ప్రశంసలు 'డెకాయిట్' చిత్రానికి మరింత ప్రచారం తీసుకురావడమే కాకుండా, చిత్రబృందానికి ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయి. ఇప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల అంచనాలను ఎంతవరకు అందుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

## బంగ్లాదేశ్ భారత్ క్రికెట్ సంబంధాలు

### పునరుద్ధరణకు తమీమ్ ప్రయత్నాలు




**డాకా,** బంగ్లాదేశ్‌లో రాజకీయ మార్పుల వెంటనే క్రికెట్ బోర్డులో కూడా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త ప్రధానమంత్రిగా తారిఖ్ రెహమాన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత, బోర్డును స్థిరంగా చలింపజేయడం కోసం మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్‌ను బాధ్యులుగా నియమించారు. బోర్డులో నెలకొన్న అస్థిరతను తొలగించడానికి 11 మంది సభ్యులతో కూడిన అడ్-హాక్ కమిటీని ఏర్పాటు చేసి, అధ్యక్షుడిగా తమీమ్ బాధ్యతలు చేపట్టారు. రాబోయే 90 రోజులలో పారదర్శక ఎన్నికలు నిర్వహించి, బోర్డును నూతన యాజమాన్యం వద్దకు హస్తాంతర పరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అతి ఇటీవల జరిగిన టీ20 వరల్డ్ కప్ 2026 సమయంలో భారత్ పర్యటనకు నిరాకరించడం వల్ల బంగ్లాదేశ్-భారత్ క్రికెట్ సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ అసహజ పరిస్థితిని సరిచేసేందుకు తమీమ్ చర్యలు ప్రారంభించారు. ఈ ఏడాది చివర్లో ద్వైపాక్షిక సిరీస్ కోసం టీమిండియాను బంగ్లాదేశ్‌కు ఆహ్వానిస్తూ, బీసీసీఐకి అధికారిక ప్రతిపాదనలు పంపించారు. తమీమ్ భావించనేది ఏమిటంటే, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా భారత్ పర్యటన విజయవంతం అవడం ద్వారా రెండు దేశాల మధ్య క్రికెట్ బంధాన్ని మరింత బలోపేతం చేయవచ్చు.

## ఐపీఎల్‌లో కొత్త నిబంధనలు అమలు




**హైదరాబాద్,** ఐపీఎల్ 2026 సీజన్‌లో క్రికెట్ నియంత్రణ సంస్థ కొత్త నిబంధనలను అమలు చేస్తోంది. ముఖ్యంగా బెంచ్‌పై ఉండే ఆటగాళ్ల ప్రవర్తనపై కట్టుదిట్టమైన నియంత్రణలు విధించబడుతున్నాయి. మ్యాచ్ సమయంలో అవసరం లేని కదలికల వల్ల సమయం వృథా అవుతుందనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కొత్త నిబంధనల ప్రకారం మ్యాచ్ జరుగుతున్న సమయంలో బెంచ్‌పై ఉన్న ఆటగాళ్లు స్టేడియం చుట్టూ స్వేచ్ఛగా తిరగరాదు. జట్టు యాజమాన్యం ఇచ్చిన 16 మంది ఆటగాళ్ల జాబితాలో లేని వారు ఎవరూ మైదానంలోకి ప్రవేశించకూడదు. అలాగే సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు పదేపదే డ్రింక్స్, బ్యాట్లు, గ్లోవ్స్ లేదా డగౌట్ నుంచి సందేశాలు తీసుకురావడాన్ని నిషేధించారు. డ్రింక్స్ ఇవ్వడంపై కూడా స్పష్టమైన నియమాలు విధించారు. కేవలం వికెట్ పడినప్పుడు లేదా బౌండరీ వద్ద మాత్రమే ఆటగాళ్లకు పానీయాలు అందించాలి. అంపైర్ల అనుమతి లేకుండా మైదానంలోకి ఎలాంటి పానీయాలు తీసుకురావడం అనుమతించబడదు. ఇంకా, మైదానంలోకి వచ్చే ప్రతి ఆటగాడు తప్పనిసరిగా క్రికెట్ దుస్తులు ధరించి ఉండాలి. సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్లుగా లేని ఆటగాళ్లు బౌండరీ, కంచె మధ్య ప్రాంతంలో ఉన్నప్పుడు టీమ్ ట్రైనింగ్ బిబ్స్ ధరించడం తప్పనిసరి చేశారు. ఈ మార్పులతో మ్యాచ్‌ల నిర్వహణ మరింత క్రమబద్ధంగా సాగడంతో పాటు సమయపాలన మెరుగుపడుతుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, Mahabubabad,, TELANGANA-506101.
Published at Jammikunta, **KARIMNAGAR-TELANGANA**. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com